గాంధీ దర్శనం



మండలి వెంకటకృష్ణారావు

గాంధీదర్శనం

(వ్యాస సంపుటి)

మండలి వెంకట కృష్ణారావు

గాంధేయ సమాజ సేవా సంస్థ

గాంధీ క్షేత్రం -అవనిగడ్డ 521 123

కృష్ణాజిల్లా – ఆంధ్రప్రదేశ్

ప్రథమ ప్రచురణ
ఆగస్టు 1988
ప్రచురణ నెం. 8

వెల: 5-00

ముఖచిత్రం : శ్రీ ఆనంద్
శ్రీ మండలి రేఖా చిత్రం : శ్రీ పి. టి. రెడ్డి

ముద్రణ:
రూత్-డైక్‌మన్ ప్రింటింగ్ ప్రెస్
గాంధీక్షేత్రం – అవనిగడ్డ

ప్రతులకు :
గాంధేయ సమాజ సేవా సంస్థ
గాంధీ క్షేత్రం అవనిగడ్డ-521 128
కృష్ణాజిల్లా ఆంధ్రప్రదేశ్

విషయసూచిక

పరిచయం

పద్మభూషణ్

డా।। మోటూరి సత్యనారాయణ

మిత్రులు మండలి కృష్ణారావు గారు రచించిన "గాంధీ దర్శనం'' ఆమూలాగ్రంగా చదువుతూ ఉంటే గాంధీ యుగంలో నేను స్వయంగా గాంధి గారి సంపర్కంలో గడపిన కాలంలో జరిగిన ఘట్టాలు, అనుభవాలు జ్ఞాపకం వచ్చినాయి.

1917 సెప్టెంబరు మాసంలో దేశభక్తులు, ప్రఖ్యాత దేశ సేవానిరతులైన చెరుకువాడ నరసింహంగారి ఉపన్యాసం గాంధీ గారి గురించి కవుతరంలో విన్నది మొదటి జ్ఞాపకం. వారు స్వయంగ అప్పుడప్పుడే గాంధీజీ ప్రారంభించిన ఆశ్రమాన్ని చూచి గాంధీ గారి నిత్య జీవితాన్ని గురించి చెప్పుతూ చెపుతూ వారి తపశ్చర్యను, విజ్ఞానాన్ని, సేవాపరత్వాన్ని పరవశులై వర్ణించి శ్రోతలలో ఆత్మ విస్మృతిని కలిగించారు. అది గాంధీ గారి వ్యక్తిత్వంలోను, వారి విజ్ఞాన వివేక వైదుష్యంలోను నాకు గట్టి నమ్మకం కలగడమే కాక, వారి వ్యక్తిత్వంలో లీనమయి పోవడానికి సంకల్పం చేసుకోవడానికి ప్రేరణ ఏర్పడింది. 1917 నుండి మూడు దశాబ్దాలు ఆయనతో సాన్నిహిత్య మేర్పరచుకొనడమేగాక, ఆయన ప్రేమను, అభిమానాన్ని, ఆదరణని సంపాదించడానికి కృషి చేసిన వాళ్ళలో నేనొకడిని.

ఆయన వ్యక్తిత్వం చూచేవారికి ఒక కాంతి పుంజంగాను, వినేవారికి ఒక జ్ఞాన ప్రకాశికగాను, ఆదర్శ నిర్మాణం చేసుకొనే వారికి ఒక ధృవతారగాను ఏర్పడడానికి కారణాలు ఎంతోమంది ఎన్నో విధాలుగా చెప్పుతారు. కొందరు ఆయనను ఋషిగాను, మరికొందరు రాజకీయవేత్తగాను, ఇంకా కొందరు సహజంగ దివ్యత్వము సంపాదించుకో గలిగిన మహామహుడుగాను అయిన మానవుడుగాను వర్ణిస్తారు. ఈ మధ్య అమెరికాలో పర్యటన చేస్తుప్పుడు ఒక పాత్రికేయుడు గాంధీగారు ఇంత గొప్ప ఖ్యాతిని సంపాదించడానికి కారణమేమిటి అని ప్రశ్న వేస్తే నాకు తోచి చెప్పిన సమాధాన మిది. ''ప్రపంచంలో ఇతరులను జయించిన వారంతా పరాక్రమవంతులు. వారి పరాక్రమం జయింపబడిన వారి

పరాక్రమంతో సాధారణంగా పోల్చబడుతుంది. కాని తనను అంటే బలహీనతను తన ఆత్మశక్తితో సాధించి తదితరులెవ్వరూ చూపలేని సాహసాన్ని, చేయలేని కార్యాన్ని, సంపాదించుకోలేని శక్తిని కనపరచినప్పుడు అతనొక అజేయ పురుషుడుగ పేర్కొనబడతాడు. ఏ బలహీనత ఆయనను లొంగతీయలేనప్పుడు ఆయన ఆత్మ విజయాన్ని సంపాదించి తదితరులకు ఆదర్శపురుషుడవుతాడు. ఇట్టి గొప్పతనమే గాంధీ గారికి తెచ్చిన ప్రఖ్యాతి.

ఆయన తన తపశ్చర్యలవల్ల విజ్ఞానులలో ఉత్తముడైన విజ్ఞానియే కాకుండా, ఉత్తముడైన పండితుడని చెప్పడానికి కూడ ఎన్నో ఘట్టాలు నేనెరుగుదును. ఒకనాడు సేవాగ్రామ్‌లో కాంగ్రెసు కమిటి మీటింగు జరుగుతుంది. ఒక కఠిన తరమైన సమస్యను గురించి ముసాయిదా తీర్మానం తయారు చేయవలసి వచ్చింది. కమిటీలో ఎంతోమంది మేధావులున్నా ఈ పని గాంధీ గారికే అప్పజెప్పారు. ఆయన తయారుచేసిన ఆ ముసాయిదా కమిటి సభ్యులంతా చూచి సరే అన్నారు కానీ, నెహ్రూ గారికి నచ్చలేదు. ఆయన ఆవేశంతో ప్రతి వాక్యాన్ని విమర్శించాడు. గాంధీ గారు అంతా నెమ్మదిగా ఇది సరిదిద్ది నాకివ్వడానికి ఎంత కాలం పడుతుందని పండిత నెహ్రూని అడిగాడు. ఈ రాత్రి చూచి ప్రొద్దున్నే యివ్వగలనని నెహ్రూ ముసాయిదా తీసుకుని వెళ్ళాడు. మర్నాడు ప్రొద్దున్న యధాతథంగా తెచ్చి ''బాపూజీ! నేను నిదానంగా ఆలోచించిన తరువాత ఇందులో ఒక వాక్యం కూడ మార్చనక్కరలేదని నిర్ణయించుకున్నాను'' అని చెప్పినాడు. బాపూజీ నవ్వి, ముసాయిదాను తీసుకున్నాడు. ఇంగ్లీషులో ప్రకాండ పండితుడుగ పేరు పొందిన అద్భుత పాండిత్యం ఆయనకుందని ఇంత అపార పాండిత్యం ఉండి కూడ సరళమైన భాషలో గూఢమైన అభిప్రాయాలు కూడ చెప్పగలిగిన మేధస్సు తదను రూపమైన అనుభవమూ దానికి అణుకువ అంటే నిరాడంబరత్వము ఆయనకు ఉండబట్టే మహాత్మా పదవి పూర్తిగా ఆయనకు చెల్లింది.

''గాంధీదర్శనం'' అని సాధారణంగా వాడుతున్నాము. దర్శనమంటే ఒక ఉత్తమోత్తమమైన ఉదాత్తమైన బుద్ధికి అందని పండిత ప్రపంచానికి అంతకీ

స్వీకారంకాగల తాత్విక చింతన అని సాధారణంగ అర్థం చెప్పుతారు. కాని మనం వాడుకునే ఈ గాంధీదర్శనంలో ప్రాచీన ఋషులకు మాత్రమే లోబడి మనకు లభ్యమయ్యే దర్శనశాస్త్రం కాదు. ఈ దర్శనశాస్త్రాలు వివేకం, విజ్ఞానంతోకూడి సత్యాన్ని మాత్రమే బోధించే వేదాంతానికి సంబంధించిన ఉపనిషత్సంచయమూ కాదు. సంకలనమూ కాదు. ఈ సంచయమూ, సంకలనము భౌతిక ప్రపంచానికి చెందింది. కర్మ ప్రపంచానికిది బహుదూరం. దాని పరిభాష విద్వాంసులకీ, పండితులకి, భాషాశాస్త్రజ్ఞులకి, ధర్మవేత్తలకి, ధర్మప్రచారకులకి కర్మభూమిగా వాడబడుతూ వచ్చింది. కానీ గాంధీదర్శనంలో ఉన్న వేదాంతమంతా సాధారణ మానవుని జీవితంతో పెనవేసుకొని ఉంది. గాంధీ దర్శనానికి ఆధారభూమి మానవజీవితం. ఈ దర్శనశాస్త్ర జ్ఞానపరిణామం ప్రతిమనిషిని కార్యనిష్ఠాపరుని చేయడమే కాకుండా, కార్యనిష్ఠాపరులైన కార్యనిష్ఠకు అంకితమైన జనసముదాయాన్ని తయారుచేయడం. ప్రతిమానవుడు పుట్టుకతో పరావలంబి అయినప్పటికీ స్వశక్తివల్ల స్వకీయ కార్యప్రణాళికా ప్రభావాలవల్ల స్వావలంబి కావడానికి ప్రయత్నం చేస్తాడు. కానీ ఈ విశాల ప్రపంచంలో స్వావలంబి ఎవరూలేరు. పరావలంబిగా ఉండటానికి స్వయంగా ఇచ్ఛగించేవాళ్ళు కూడ తక్కువ. ఈ పరావలంబినమే ప్రతి నిమిషం ఒకదానినొకటి ఒకశక్తిని మరొక శక్తిని సమ్మిళితం చేసుకుని పరస్పరావలంబిగా సమాజాన్ని మలచగలిగినప్పుడే సమాజంలో శాంతిభద్రతలే కాకుండా స్వేచ్ఛ ఏర్పడుతుంది. పరస్పరావలంబనం నేర్పడమే గాంధీదర్శనం యొక్క పరమ ధ్యేయం. అంతిమ పరిణామం.

నాకు చిరమిత్రులు, నిర్మాణ కార్యక్రమక్షేత్రంలో అగ్రగణ్యులు, మానవ సేవయే మాధవ సేవయని నమ్మి తన జీవితాన్ని గాంధీదర్శన వ్యాప్తికోసం అంకిత మొనర్చి గాంధీక్షేత్రాన్ని నడిపిస్తున్న మండలి కృష్ణారావు గారికి 63వ జన్మదినోత్సవం 4, ఆగస్టున జరుగుతుందని ఆ తరుణంలో వారు రచించిన ఈ ''గాంధీదర్శనం'' ఆవిష్కరింపబడుతుందని తెలుసుకొని ఎంతో ఆనందంగా ఉంది. శ్రీ కృష్ణారావుగారు తాను నమ్మిన ఆదర్శానికి కార్యనిర్వహణకు అనుకూలమైన

కార్యకర్తలను ఎన్నుకోవడంలోను, తగిన వనరులను సమీకరించడంలోను గొప్ప దిట్ట. సదుద్దేశ్యంతోనూ, ఉత్కృష్టమైన ఆదర్శంతోను ప్రారంభించిన ఏ పనీ ఎప్పుడూ సమాప్తం కాదు. సమాప్తం కాకూడదు కూడాను. మంచి పనికి సమాప్తి అంటూ లేనేలేదు. వారి గాంధీక్షేత్రం కూడా ప్రవర్థమానంగా ఉండటమే కాకుండా అనంతంగాను, అతివిస్తృతితో వెలయింపగలిగేశక్తి వారికి కలదని, తప్పక కలుగుతుందని నేను విశ్వసిస్తున్నాను.

మద్రాసు

మోటూరి సత్యనారాయణ

27-7-88

సంపాదకుని ప్రస్తావన

జోశ్యుల సూర్యనారాయణమూర్తి

గాంధీజీ సిద్ధాంతాల ప్రభావం తన మీద చిన్ననాడే ప్రసరించటం వల్ల విద్యార్థి దశనుండి జాతీయ భావాలతో పర ప్రభుత్వ ప్రభావాన్నెదుర్కొంటూ, అనేక ఉద్యమాలలో పాల్గొంటూ, రాజకీయ పాఠశాలల ద్వారా సహచరుల్ని అభివృద్ధి పరుచుకొంటూ, పురోగమించి క్రియాశీలియై ప్రసిద్ధి పొందిన కార్యకర్త శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు.

తన సేవా భావానికీ, గాంధీజీ ఆశయాలకీ కూడ కార్యరూపాన్నివ్వగలిగిన ఒక కేంద్రాన్నేర్పరచి బహుశాఖలతో దాన్ని విస్తరింపజేసిన ప్రజ్ఞావంతుడు శ్రీ మండలి. ఆ కేంద్రమే సేవా వ్యవసాయానికొక క్షేత్రమయింది. అదే గాంధీక్షేత్రం. అది విద్యాభ్యాసానికితోడు సాంకేతిక విద్యలో కూడ శిక్షణ నందిస్తోంది. పుస్తక ప్రచురణ చేస్తోంది - గాంధేయ సమాజ సేవా సంస్థగా. గాంధీక్షేత్రం తన పేరిట ఒక మాసపత్రికను మూడు సంవత్సరాలకు ముందు ప్రారంభించి ఇప్పుడు నాల్గవ సంపుటిని నడుపుతోంది. అందులో శ్రీ మండలివారు వివిధ విషయాలపైన ఇప్పటికి వ్రాసిన వ్యాసాలు ఇరవైకి పైనే ఉన్నాయి. అయితే వాటిలో నుంచి వారు ప్రత్యేకించి గాంధీజీని గురించీ, గాంధీ ఆశయాల్ని గురించీ వ్రాసిన పది వ్యాసాలను గ్రహించి గాంధీ దర్శనం పేరిట ఈ పుస్తకం ప్రచురించటం జరిగింది.

ప్రధమంగా శ్రీ మండలి గాంధీజీని 'సందర్శించిన' సందర్భాన్ని దాని వల్ల తాము పొందిన స్ఫూర్తిని వివరించే ''గాంధీ దర్శనం'' అనే వ్యాసంతో ఇది ప్రారంభమయింది. తరువాత గాంధీ ప్రధమోపన్యాస విషయం దాని ప్రాముఖ్యం వివరించారు. ఇందులో పొందుపరచబడిన వివిధ శీర్షికలతో కూడిన వ్యాస పరంపర గాంధీజీని సంక్షిప్త రూపంలో పాఠకునిచేత దర్శింపజేస్తోంది. అందుచేత కూడ ఈ పుస్తకానికి గాంధీదర్శన మనే నామకరణం చేయబడింది. గాంధీక్షేత్ర మాసపత్రిక ఒకసారి వారితో తాను జరిపిన ఇష్టాగోష్ఠిని దీనికనుబంధంగా ప్రచురించటం జరిగింది. ఈ అనుబంధం శ్రీ మండలివారి కృషికీ కృతిత్వానికి ఒక

దిగ్దర్శనం అవుతుందనే ఉద్దేశ్యంతో దీన్నిక్కడ అనుబంధించటం జరిగింది. ఒక కార్యకర్త, ఒక జాతీయనాయకుడు గాంధీ భావాల్నీ, కృషినీ, ఫలితాన్నీ తాను గ్రహించిన అనుభవంతో వివరించిన ఈ గాంధీ దర్శనం సంక్షిప్తమై ఉన్నా, పాఠక లోకంలో ఒక సద్భావాన్ని, సత్సంకల్పాన్నీ కలిగించేది కాగలదని ఆశిస్తున్నాం. ఆ ఉద్దేశ్యంతోనే **63**వ జన్మదినోత్సవ బహూకృతిగా ఈ కృతిని ఈ కృతికర్తకే అందించటం సంతోషదాయకంగా ఉంది. కృతికర్త ఇంకా కొన్ని కృతులు వెలయించి సమకాలిక సమాజానికి సముత్తేజం కలిగిస్తారని ఆశిస్తూ దీన్నందిస్తున్నాం.

''గాంధీ దర్శనానికి పరిచయ వాక్యాలు వ్రాసిన ప్రముఖ గాంధేయవాది పద్మభూషణ డా॥ మోటూరి సత్యనారాయణ గారికి మా కృతజ్ఞతాభివందనాలు.

- జోశ్యుల సూర్యనారాయణమూర్తి

సంపాదకుడు

1. గాంధీ దర్శనం

మహాత్మాగాంధీని దర్శించడం అంటేనే మహాభాగ్యంగా ప్రజలు తలిచేవారు. గాంధీజీ వస్తున్నారంటే ఆ రోజుల్లో మైళ్ళకొలదీ నడిచి ఆయన దర్శనానికి వెళ్ళేవారు. దక్షిణాఫ్రికానుండి ఆయన రాగానే శ్రీ గోపాలకృష్ణ గోఖలే సలహా మేరకు భారతదేశం అంతా తిరిగారు. ఖాధీ ఉద్యమానికి, హరిజనోద్ధరణకు మారుమూలలలో ఉన్న గ్రామాలకు సైతం గాంధీ వెళ్ళారు. 1929 జులైలో గాంధీజీ కృష్ణాజిల్లాలో పర్యటించినప్పుడు దివిసీమలో అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక గ్రామాలకు వచ్చారు. వేలకొలదీ ప్రజలు పాల్గొన్నారు. మా నాన్న శ్రీ మండలి వెంకట్రామయ్యగారు ప్రాథమిక పాఠశాలలో టీచరు. గాంధీభక్తుడు. గాంధీ ఉపన్యాసాలు విని ప్రభావితుడైనాడు. పిల్లలకు, గ్రామాలలోని ప్రజలకు గాంధీజీని గురించి చెప్పి జాతీయోద్యమాన్ని బలపరుస్తూ ఉండేవారు.

అప్పటికి నాకు మూడు సంవత్సరాలవయసు. నాలో జాతీయభావాలను, గాంధీతత్వాన్ని ఉగ్గుపాలతో మానాన్నగారు రంగరించిపోశారు. 19....1లో అవనిగడ్డ ఉన్నతపాఠశాలలో చదుపుతున్నప్పుడు పత్రికలలో గాంధీజీ ప్రబోధాలను తెలుసుకొంటూ, వ్యక్తిగత సత్యాగ్రహము చేస్తున్నవారిని చూచి ఉత్తేజితులమయ్యేవారము, ఎచట సత్యాగ్రహం జరిగిన వెళ్ళి 'గాంధీజీకీ జై' అంటుండేవారము. గాంధీజీని చూడాలని ఉండేది. 1932 ఆగస్టు ఉద్యమంలో ఉత్సాహంగా పనిచేయడం, 1943 ఆగస్టు 9వ తేదీన అవనిగడ్డలో జరిగిన సభలో లాఠీచార్జీకి గురికావటం, పోలీసులు పట్టుకుని మైనర్లని వదలిపెట్టడం జరిగింది.

గాంధీజీని జైలునుండి విడిచిపెట్టారు. 1942లో కాంగ్రెసు నాయకులు విడుదల అయినారు. బొంబాయిలో కాంగ్రెస్ సమావేశం జరిగింది. గాంధీజీ వస్తున్నారని అచటకు వెళ్ళాము. సాయంత్రం ఆరు గంటలకు ప్రార్థనా సమావేశము. గేటు తీయగానే బిలబిలా ప్రజలంతా సమావేశ స్థలానికి వెళ్ళి కూర్చున్నాము. అంతా నిశ్శబ్దం, గాంధీజీ వచ్చారు. అందరికీ సమస్కరించారు. ఆ తేజోమూర్తిని చూడగానే నాలో అనుకోని చైతన్యం వచ్చింది. ఇంకా చూడాలని ఉంది. కానీ సమావేశము అయిపోయింది.

1946 జనవరి 21 వ తేదీన మద్రాసులో దక్షిణ భారత హిందీ ప్రచారసభ రజతోత్సవాలలో పాల్గొనడానికి కలకత్తా నుండి గాంధీగారు వస్తున్నారని తెలిసింది. రేపల్లె మీదుగా తెనాలి వెళ్ళాము. 21 వ తేదీ ఉదయం గాంధీజీ స్పెషల్‌ట్రైన్‌లో వచ్చారు. వేలాది ప్రజానీకం జయజయ ధ్వానాలు చేశారు. కనూగాంధి, రామకృష్ణబజాజ్ 'రామధున్' ఆలపించారు. గాంధీజీ ప్రజలకు దర్శనమిచ్చారు. రజతోత్సవాలు చూసుకొని తిరిగివెళుతూ ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడలో ఆగారు. మరల దర్శనం చేసుకున్నాము గాంధీని ఎప్పుడు చూసినా నాలో ఏదో తెలియని చైతన్యము, ఉద్వేగం కలుగుతూ ఉండేవి. గాంధీజీ సేవాగ్రాంలో ఉండగా వెళ్ళాలని వారితో కొన్నిరోజులు ఆశ్రమంలో ఉండాలనీ కోర్కె కలిగింది. 1947 ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్యం వచ్చింది. దేశవిభజన మతకల్లోలాలను రెచ్చగొట్టింది. నవఖాలీలో ఘోరమైన హత్యలతో భీభత్సం అయింది. గాంధీజీ ఆ ప్రాంతాలలో పాదయాత్రచేసి చివరకు ప్రాయోపవేశం చేశారు. దేశం దద్దరిల్లిపోయింది. తిరిగి ఢిల్లీ వచ్చారు. 1948 జనవరి 30వ తేదీన సాయంత్రం ఢిల్లిలో ప్రార్ధనా సమావేశానికి వెళుతూ తుపాకీ గుండ్లకు బలిఅయిపోయారు. దివ్యజ్యోతి ఆరిపోయింది. సేవాగ్రాంలో ఉండాలనే కోర్కె నెరవేరనేలేదు.

1948 డిసెంబరులో జయపూర్ మహాసభలు డా॥ పట్టాభి అధ్యక్షన జరిగాయి. పట్టాభిగారు నేనంటే ఎంతో ఆప్యాయతగా ఉండేవారు. శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తి, నేను కలిసి పట్టాభిగారి పట్టాభిషేకము చూడాలని జయపూర్ వెళ్ళాము. గాంధీలేని కాంగ్రెసు మహాసభలు. గాంధీగారులేరు కాని గాంధీవాణి మార్మ్రోగుతుంది. ఆ సభలు చూసుకొని వార్ధాలో దిగాము. గాంధీలేని సేవా గ్రామంలో అడుగు పెట్టాము. అచ్చట కార్యక్రమాలనన్నిటినీ తిలకించాము. వివిధ నిర్మాణ కార్యక్రమ సంస్థలను చూశాము. గాంధీజీ కార్యక్రమాలను నిర్వహించ డానికి మనము కూడా ఒక ఆశ్రమాన్ని ఎందుకు పెట్టకూడదనే ఆలోచన వచ్చింది. ఆలోచిస్తూనే ఉన్నాను. 1957లో అనుకోకుండా పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయినాను. ప్రజలకు అందుబాటులో ఉండాలని నాగాయలంక నుండి మామగారి కుటుంబంతో అవనిగడ్డ సంతబజారులో ఇల్లుతీసుకొని ఉన్నాము. తరువాత హైస్కూలు దగ్గర 40 సెంట్ల స్థలము తీసుకొని ఆశ్రమము కట్టుకోవాలని

అనుకొన్నాము. 4 పూరిపాకలు వేయించాలని అనుకొన్నాము. అప్పుడే కమ్యూనిస్టులు గ్రామంలో గడ్డివాములు, ఇండ్లు తగులబెట్టారు. పూరిపాకలు చేస్తే ఈ ప్రమాదం వస్తుందని బంగాళ పెంకుతో ఇల్లు వేయాలని ప్రారంభించాము. అది చివరకు డాబాగా మారింది. ఆశ్రమం కాకపోయినా చెట్లు పెరిగి విశాలమైన స్థలము ఉండుటచే ఆశ్రమము లాగానే ఉంటుంది.

1969లో గాంధీ శతజయంత్యుత్సవాలు దేశమంతటా జరుగుతున్నాయి. ఏమిచేయాలనే ఆలోచన వచ్చింది. దివిసీమ సహకార వ్యవసాయ బృహత్తర ప్రణాళికా ప్రారంభోత్సవానికిగాను హైస్కూలు ప్రక్కన 80 సెంట్ల స్థలం బాగు చేయించినాము. దీనిని గాంధీ విజ్ఞాన కేంద్రంగా ఏర్పాటు చేయాలని దివిసీమ వైజ్ఞానిక సాంఘిక సేవాసమితి తరపున లీజుకు ఇమ్మని జిల్లా పరిషత్‌ను కోరాము. గాంధీజీ నిర్మాణ కార్యక్రమము అమలు జరుపుటకు గాంధీక్షేత్రంను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని గాంధీ శతజయంతి ఉత్సవాలను అచట జరిపినాము. అదే గాంధీ క్షేత్రంగా మారింది.

1946లో గాంధీజీ దర్శనము వలన నాలో కలిగిన చైతన్యమే ఈ గాంధీ క్షేత్రం నిర్మాణము. సేవాగ్రాం కల్పించిన స్ఫూర్తియే సేవాశ్రమ స్థాపన.

1941లో గాంధీజీ ప్రబోధాలే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి ఉత్తేజపరిచాయి. ఒకవైపు చదువు, రెండవవైపు రాజకీయాలలో ప్రవేశం, తరువాత రాజకీయ పదవులు, నిర్మాణ కార్యక్రమాలు అమలు జరుపుతూ ఉన్నాను. పదవిలో ఉన్నా లేకపోయినా, గెలిచినా ఓడినా సమాన స్థాయిలో గాంధేయ మార్గాన్ని అనుసరిస్తూ నడిచే అవకాశం కలిగినందుకు సంతృప్తి చెందుతూ ఉన్నాను. మానవతకు విలువనిచ్చి, సేవాశక్తిని పెంచి నైతిక విలువలను నిలబెట్టేదే గాంధేయమార్గం. గాంధేయ మార్గమే ప్రపంచ శాంతికి తోడ్పడేది. ఆ మార్గమే మనందరికీ మార్గదర్శకము. ఆచరిద్దాం. ఆదర్శంగా ఉందాం.

2. కాశీలో గాంధీజీ ప్రథమ ఉపన్యాసము

గాంధీజీ దక్షిణాఫ్రికా నుండి 1913లో భారతదేశానికి వచ్చారు. రాగానే భారత రాజకీయాలలో అగ్రగణ్యుడైన శ్రీ గోపాలకృష్ణ గోఖలే దగ్గరకు వెళ్ళి భారతదేశ పరిస్థితులను గురించి తెలుపమని, వారి కర్తవ్యాన్ని సలహా అడిగారు.

''ఒక సంవత్సరంపాటు ఎచ్చటా ఉపన్యాసంగాని, ఏ విషయముపై ప్రకటనగాని, చేయవద్దని, భారత రాజకీయ పరిస్థితులను తెలుసుకొని ప్రజలను చూచి వారిని గమనించాలని, తరువాత పరిస్థితులను మదింపు చేసుకొని చేయవలసిన కార్యక్రమాన్ని తానే నిర్ణయించుకోవాలని'' శ్రీ గోఖలే గాంధీకి సలహా యిచ్చారు. అదే విధంగా తు॥చ॥ తప్పకుండా అమలు పరిచారు. కాశీ విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు వైశ్రాయిహార్డెంజ్ ప్రభువును మదన్‌మోహన్ మాలవ్యా ఆహ్వానించారు. గాంధీని కూడా ఒకరోజు వచ్చి ఉపన్యసించవలసిందిగా మాలవ్యా ఆహ్వానించారు. తన గురువు గోఖలే చెప్పిన విధంగా ఆచరించి సంవత్సరము గడువు పూర్తి అగుచుండుటచే గాంధీ మాలవ్యా ఆహ్వానాన్ని అంగీకరించారు. భారతదేశానికి వచ్చిన తరువాత ప్రథమముగా గాంధీ బహిరంగసభలో పాల్గొన్నారు. కాశీపట్టణానికి చేరారు. కాశీ విశ్వనాథస్వామివారిని దర్శనము చేసుకొన్నారు. ఆ దేవాలయం చుట్టూవున్న దుర్వాసన, గలీజు గురించి చాలా బాధ పడ్డారు. ఒక ప్రక్క దేవుని పవిత్రంగా పూజిస్తూ, మరొకప్రక్క ఆ పవిత్రమైన దేవాలయ పరిసరాలు దుర్గంధపూరితంగా వుండి అనారోగ్యాన్ని కల్గించే విధంగా వుండటం తీవ్రంగా నిరసిస్తూ పారిశుద్ధ్యాన్ని గురించి హెచ్చరిక చేశారు.

1916 ఫిబ్రవరిలో వైశ్రాయిహార్డెంజ్ ప్రభువు కాశీవస్తున్న సందర్భంగా కనీవిని ఎరుగని విధంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. విప్లవకారులు బాంబులు విసురుతారనే పుకార్లతో వేలాది రక్షకభటులు దారి పొడుగునా, పట్టణం అంతా కాపలా కాశారు. ఈ భద్రతా ఏర్పాట్లను చూచి గాంధీ నివ్వెరపోయారు. పరిపాలన చేసేవారికి అంత భయమెందుకు? ఆత్మ విశ్వాసం లేనివారు ఎంతకాలం పాలిస్తారు? అని వ్యాఖ్యానించారు.

వైస్రాయిగారు వస్తున్నారని సభను శోభాయమానంగా అలంకరించారు. సంస్థానాధీశులు రత్నఖచిత ఆభరణాలను ఆపాదమస్తకము ధరించి కనులను మిరిమిట్లుకొలిపేటట్లు సభను అలంకరించారు. గాంధీజీ మనసు కలత చెందింది. మరునాడు మాట్లాడుతూ ''మీరు మీ ఆభరణములను విసర్జించి వీటిని పేద ప్రజానీకము యొక్క సంపదగా భావించనంతవరకు ఈ దేశానికి శుభము చేకూర'' దని గాంధీజీ నిర్మొహమాటంగా హెచ్చరిక చేశారు. ''స్వదేశ సంస్థానాలలో గాని, బ్రిటిషు ఇండియాలో గాని ఎవ్వరైనా పెద్ద రాజభవనములను నిర్మించుకొన్నారని విన్నచో నా హృదయం విలపించును. వాటి నిర్మాణమునకు ఆయిన డబ్బంతయు పేదప్రజల నుండి ప్రోగుచేసినదేకదా అని నేను ఆలోచింతును'' అని గాంధీజీ అన్నారు.

సంస్థానాధీశులలో తీవ్ర సంచలనం కల్గింది. సభికులకు ఆశ్చర్యం కల్గించింది. భవిష్యత్తు గాంధీ నాలుకను పలికించినటుల తరువాత నిజము అయినాయి. సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం కావడం, వారి ఆస్తులు ప్రభుత్వపరం కావడం, చివరకు రాజభరణాలు రద్దు చేయడం జరిగింది. వారి సంపదను ప్రజలు అనుభవించుచున్నారు.

''ఆంగ్లేయులిచ్చట పాలకులై వుండగా దేశమెన్నటికీ ఉద్ధరించబడజాలదు. వారిచటనుండి వెడలిపోవలసిందే అని వారితో చెప్పుటకు నేనెన్నడునూ వెనుకాడను. ఈ దృఢ సంకల్పాన్ని సమర్థించుకొనుటకు నా ప్రాణార్పణ చేయవలసివచ్చినచో నేనందులకు సంసిద్ధుడను'' అని గాంధీజీ అన్న మాటలను విన్న సభికులు వారి ధైర్యాన్ని మెచ్చుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బహిరంగంగా, నిర్మొహమాటంగా, గట్టిగా మాట్లాడిన మొదటి వ్యక్తి గాంధీయే! గాంధీ మొదటి ఉపన్యాసమే. ఆయన ఆశయం, సంకల్పము ఎంత గొప్పదో వాటిని సాధించటానికి కూడా అంత మహత్తరమైన పద్ధతిని అనుసరిస్తుంటారు. సత్యము, అహింస, ధర్మ సూత్రాల ననుసరించి సత్యాగ్రహములను లోకోత్తర, మహత్తర పద్దతిలో స్వాతంత్ర్య సమరాలను నడిపించి, రవి అస్తమించని సామ్రాజాధిపత్యాన్ని ఎదిరించి, బ్రిటిషు వారిని భారతదేశం నుండి వెడలగొట్టి భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించిన మహోజ్జ్వలమైన నాయకుడు మహాత్మాగాంధీ.

''మన భారతదేశము పేరు నాకత్యంత ప్రియమైనది. హింసా చర్యలకు మన దేశంలో ఏమాత్రము చోటీయవలదని నేను మిమ్ములను అర్థించుచున్నాను. పాలకులకు మీరు చెప్పదలచిన మాటలు దాపరికం లేకుండా స్పష్టంగా చెప్పివేయుడు. మీ మాటలు వారికి రుచించక, వారివలన మీకేవైనా కష్టములు కల్గినచో వాటిని ఆనందంతో అనుభవించుటకు తయారుకండు. వారి నెవ్వరునూ దూషింపవద్దు. పరుషోక్తులు పలుకకుడు'' అని గాంధీ సభలో చెప్పెను. విప్లవకారుల దేశభక్తి పట్ల అపారమైన గౌరవం ఉన్నదని దేశంకొరకు వారు ప్రాణత్యాగం చేయుట హర్షణీయమైనదని, కాని వారి హింసాత్మక చర్యలు సమర్థనీయములు కావని విప్లవకారులకు హెచ్చరిక చేశారు. గాంధీ ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్న అనీబిసెంట్ కూడ మధ్యలో సంజ్ఞ చేసి ఉపన్యాసాన్ని మధ్యలో ఆపమని కోరారు. గాంధీయొక్క స్పష్టమైన సత్య వచనాలు, నిర్మొహమాటమైన విమర్శలు ప్రేక్షకులలో అలజడి కల్గించాయి.

ఈ ఉపన్యాసము భారతస్వాతంత్ర్య చరిత్రలో మరపురానిది. చరిత్ర సృష్టికి మూలకారణమైనది. భారత రాజకీయ నాయకులలో, కార్యకర్తలలో ఆలోచనలను రేకెత్తించి మహోద్యమాలకు దారితీసింది. ప్రజలలో నవచైతన్యానికి నాంది పలికింది. గాంధీవాణి భారతవాణి అయింది.

పాల సముద్రమే నడచి వచ్చిన రీతి, హిమాచలాగ్ర శృం
గాలు, కరాలుసాచి మనకై యరుదెంచిన భాతి, శాంతి స
త్యాలు మనుష్యరూపమును దాలిచి నేలకు డిగ్గినట్లు, గాం
ధీ లలితాత్ముఁ డుజ్జ్వల పతిన్ భరతావనిపైన కాలిడెన్.

దాశరథి

3. గాంధీ - గాంధీజం

''గాంధీజి చనిపోవచ్చు, గాంధీజం ఈ ప్రపంచం ఉన్నంతవరకు ఉంటుంది'' డా॥ పట్టాభి గాంధీ మరణానికి పూర్వం అన్నమాటలివి.

ఏసుక్రీస్తు, బుద్ధుల ప్రబోధాలను ఆచరణలో పెట్టి బృహత్తరమైన భారతదేశానికి మహత్తరమైన స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయుడు మహాత్మాగాంధీ. ఆశయము ఉన్నతమైనదే కావచ్చు. దానిని సాధించే మార్గము అంతకంటే మహత్తరమైనదిగా ఉండాలని అంటారు గాంధీజీ. భారతదేశ స్వాతంత్ర్యము మహత్తరమైన ఆశయము. దాని సాధనకు మహోన్నత మార్గాన్ని అన్వేషించారు. సత్యము, అహింస, త్యాగములతో కూడిన సత్యాగ్రహమను పోరాట మార్గమును చూపారు.

''తండ్రీ వీరిని క్షమింపుడు. వారేమిచేస్తున్నారో వారికే తెలియదు'' అని శిలువ వేస్తున్నప్పుడు ఏసుక్రీస్తు అన్న మాటలను రాజకీయాలతో ప్రయోగం చేసినవారు గాంధీజీ. దక్షిణాఫ్రికాలో జాత్యహంకారంతో అధికారి తన చెంప మీద కొట్టినప్పుడు రెండవ చెంపమీద కొట్టమని చూపారు. దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కుల కొరకు శాంతియుత పోరాటాలు నడిపి, విశేషానుభవంతో భారతదేశానికి 1915లో తిరిగి వచ్చిన గాంధీజీ, శ్రీ గోపాలకృష్ణగోఖలేను కలుసుకుని సలహాను అడిగినారు. సంవత్సరం పాటు దేశపరిస్థితులను తెలుసుకుంటూ, ఏమీ మాట్లాడకుండా రాజకీయ పరిణామాలను పరిశీలించవలసిందిగా సలహా యిచ్చారు. గాంధీజీ ఆ సలహాను పాటించి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి కాశీ హిందూ విశ్వ విద్యాలయములో శ్రీ మాలవ్యా ఆహ్వానముపై వెళ్ళి ప్రథమంగా బహిరంగ ఉపన్యాసము చేశారు. ఆ ఉపన్యాసములో ఆశయములు - ఆచరణలను తెలియజేశారు.

''ఆంగ్లేయులిచట పాలకులై యుండగా దేశమెన్నటికి ఉద్ధరింపబడజాలదు. వారిచటనుండి వెళ్ళిపోవలసిందే. మీరిచట నుండి వెళ్ళిపొండి. అని వారితో చెప్పుటకు నేనెన్నడూ వెనుకాడను. ఈ ధృఢ సంకల్పమును సమర్థించుటకు నా ప్రాణార్పణ చేయవలసి వచ్చినచో నేనందులకు సంసిద్ధుడను కాగలనని నా

నమ్మకము. ఇట్టి మరణం నాదృష్టిలో ప్రతిష్ఠతో కూడిన మరణము'' అని తన ఆశయాన్ని గాంధీజీ సూచించారు. ''హింసాచర్యలకు మనదేశంలో ఏ మాత్రము చోటీయవలదని నేను మిమ్ములను అర్థించుచున్నాను. పాలకులకు మీరు చెప్పదలచిన మాటలు దాపరికంలేకుండా స్పష్టముగా చెప్పివేయుడు మీ మాటలు వారికి రుచించక వారి వలన మీకేమయిన కష్టములు కలిగినచో సంతోషంతో అనుభవించుటకు తయారుకండు. వారినెన్నడూ దూషించకుడు పరుషోక్తులు పలుకకుడు'' అన్నారు గాంధీ. తన ఆశయసాధనకు మార్గాన్ని చూపించారు.

తస సత్యాగ్రహవిధానాన్ని గాంధీజీ ప్రధమంలో 1. భారతదేశం నుండి కూలీలను వలస పంపకుండా ఉండటానికి, 2. చంపారన్‌లో రైతుల బాధలను తొలగించడానికి, 3. అహ్మదాబాద్‌లో నూలు మిల్లుల కార్మికుల జీతాలు పెంచడానికి, 4. వైరా ప్రాంతములో రైతు సమస్యల పరిష్కారానికి ఉపయోగించి విజయం సాధించారు.

తరువాత రౌలట్ చట్టం వలన విర్బంధ విధానాలకు వ్యతిరేకంగా ముస్లింలకు సంబంధించిన ఖిలాఫత్ ఉద్యమాలలో దేశవ్యాప్తంగా సత్యాగ్రహాలను ప్రయోగం చేశారు. ఉప్పుసత్యాగ్రహం చేపట్టేముందు 1930లో ఇర్విన్ ప్రభువుతో గాంధీజీ ఇలా అన్నారు.

''అహింసలో నాకున్న విశ్వాసం మీకు తెలిసియున్నదే. ఉద్దేశ పూర్వకంగా ఏప్రాణినిగాని నేను బాధపెట్టను. ఇక నేను మనుషులను నొప్పించే ప్రశ్నే లేదు. వారు నాకు, లేదా నా దేశానికి కీడు తలపెట్టిన వారై యుండవచ్చును. అయినను నేను వారిని నొప్పించను. భారతదేశంలో బ్రిటిషు ప్రభుత్వం అధికారం సాకుతో ఉండటం దురదృష్టమని అసుకొంటున్నాను. ఇక్కడవున్న ఏ ఒక్క ఆంగ్లేయునికీ ఎట్టికష్టము, నష్టము కలుగకూడదని నాయుద్దేశం'' ఈ మాటలు గాంధీజీ ఆలోచనలకు విధానాలకు మూలమైనవి. తరువాత భారతస్వాతంత్ర్యం సాధనకు సత్యాగ్రహ పోరాటాలను నడిపించారు. చివరలో 1942 ఆగష్టులో ''క్విట్ ఇండియా'' ''దేశాన్నుండి వెడలిపొండి'' అనే నినాదంతో చావో బ్రతుకో తేల్చుకోవాలన్న పిలుపును యిచ్చి ఆగస్టు ఉద్యమాన్ని నడిపారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చింది. గాంధీజీ స్వాతంత్ర్య ప్రదాత అయినారు.

గాంధీజీ ఆలోచన, అనడం, ఆచరించడం మనోవాక్కాయ కర్మ ఒక్కటిగా వుండటము వలన సత్యం, అహింస, త్యాగము మార్గముగా నడవటం వలన మహాత్ముడైనాడు. మానవత, మమత నైతిక విలువలతో కూడిన గాంధీమార్గమే గాంధీజం.

ప్రతివారికి తినడానికి తిండి, వుండటానికి ఇల్లు, కట్టుకోపటానికి గుడ్డ, విద్య వైద్య సౌకర్యాలు కలిగి, వారిజీవనము సుఖముగా వుండేటట్లు చేయాలని వారి కోర్కె.

1915లో కాశీ విశ్వవిద్యాలయ శంకుస్థాపనకు వైస్రాయి వచ్చిన సందర్భంగా సంస్థానాధీశులు రత్నఖచిత ఆభరణములను ఆపాదమస్తకము ధరించి కనులు మిరుమిట్లుగొలిపే విధంగా వచ్చారు. వారిని చూచి గాంధీ సభలో మాట్లాడుతూ "సంస్థానాధిపతులు ఆభరణములను విసర్జించి వీటిని పేద ప్రజానీకం యొక్క సంపదగా భావించనంతవరకు ఈ దేశానికి సుఖము చేకూర''దని అన్నమాటలు వారి ఆలోచనలను తెలియజేస్తాయి. మనము ఆస్తులను పుట్టుకతో సంపాదించుకురాలేదని, చనిపోవునప్పుడు పూచిక పుల్ల కూడా వెంటరాదని, మధ్య సంపాదించే ఈ ఆస్తులకు మనము ధర్మకర్తలం మాత్రమేననియు గాంధీజీ అనేవారు. మన అవసరాలను తీర్చేదానికంటే మించిన అస్తి మనం ప్రజల క్షేమానికి వినియోగించాలని చెప్పేవారు. ప్రజలు గుడ్డలేక బాధపడుతున్నారనే భావంతో కొల్లాయిగుడ్డ కట్టుకొంటూ, తనప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని తను కూడా ఒకపూటే భోంచేస్తూ దరిద్రనారాయణుడుగా పేరొందారు. పేదలను గురించి చెప్పుతూ వారి బాధలలో భాగస్వామి అయ్యేవారు. బాధపడుతున్నవారి సేవచేయడం గాంధీ ప్రధాన కర్తవ్యంగా భావించేవారు. ఆశ్రమ నిర్వహణలో అన్నిపనులు చేయడంలో గాంధీ పాల్గొనేవారు. వారు కాయగూరలు తరగడం, వంటపనులు చేయడం, పాయఖానాలు ఊడ్చటం వంటి (పారిశుధ్య) కార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు. మంగలి పని కూడా జేసేవారు. మానవుడు చేసే ప్రతిపనిలోనూ గౌరవం ఉందని, ప్రతిపనిని ప్రతివారు చేసుకోవాలని ఇతరుల మీద ఆధారపడి ఉండరాదని గాంధీజీ ఆచరించి చూపేవారు. కష్టపడాలి, పనిచేయాలి, స్వయంపోషకత్వం సాధించుకోవాలి అనేవారు. త్యాగం, సేవాభావం

ప్రతిపనిలో ప్రతిబింబించాలి. స్వార్థం, నిర్లిప్తత, సోమరితనములకు దూరంగా వుండాలనేవారు.

మార్క్సిజం-హింస-గాంధీజం అనేవారు కొందరు. మమతతో కూడిన మానవత, ఆప్యాయతతో కూడిన ప్రేమ, ద్వేషరహితమైన ఆలోచన, సత్యం, అహింసలతో కూడిన త్యాగము, అభిమానంతో కూడిన ఆదరణ సమాజశ్రేయస్సుకు తోడ్పడుటయే గాంధీజం, అదే సర్వోదయం.

ప్రపంచంలో టెర్రరిస్టుల ప్రాబల్యం పెరిగిన కొలదీ గాంధీ మార్గాన్ని గురించి ఆలోచించడం ప్రారంభం అయింది. హింసాయుత చర్యల వలన శాంతి సాధ్యంకాదని గాంధీ మార్గాన్ని అనుచరించటం వలననే అది సాధ్యం అవుతుందనే భావన వ్యాప్తి చెందుతోంది.

బ్రిటిష్ దేశాన్ని ఎదిరించిన గాంధీని గురించి బ్రిటిషు దేశంలో ప్రఖ్యాత సినీ నిర్మాత శ్రీ రిచర్డ్ ఎడింబరో గాంధీజీ విశిష్టతను గురించి సినిమా తీసి ప్రపంచదృష్టిని మరల్చి నేటి క్లిష్ట పరిస్థితులలో గాంధీని గురించి ఆలోచించే అవకాశాన్ని కలిగించారు. పాశ్చాత్యదేశాలలో ఈ గాంధీ సినిమా మంచి పనిచేసింది. విద్యార్థులలో, యువకులలో మార్పు తీసుకొచ్చింది. గత రెండు సంవత్సరాల క్రితం అమెరికా, కెనడా, బ్రిటన్, యూరప్ దేశాలలో పర్యటించినపుడు నేను ఈ మార్పును గమనించాను. దీనివలన భారతదేశం అంటే ఎంతో గౌరవం పెరిగింది. ప్రపంచ శాంతికి తోడ్పడేవారికి మార్గం దొరికింది. భారతదేశంలో గాంధీని మరచిపోతున్న రోజులలో ప్రపంచంలో గాంధీ విధానాన్ని గురించి శాంతి కొరకు ఆలోచిస్తున్నారు. ప్రపంచ శాంతికి, సౌభాగ్యానికి, సౌభ్రాత్రమునకు, అభివృద్ధికి గాంధీయ మార్గమే తోడ్పడగలదు.

4. కార్మిక సంక్షేమం - గాంధీజీ

1869లో పోర్‌బందర్‌లో జన్మించిన గాంధీ 1891లో ఇంగ్లడు వెళ్ళి బారిష్టరు అయిన తరువాత 1893లో అబ్దుల్లాసేఠ్ వ్యవహారాలలో కోర్టులో వాదించడానికి దక్షిణాఫ్రికా వెళ్ళారు.

కోర్టులో తలపాగా తీసి వేయవలసినదిగా జడ్జి ఆదేశించగా తలపాగా తీసివేయలేదు. కోర్టునుండి బయటకు వచ్చేశారు.

శ్వేతజాతీయులు మాత్రమే ఎక్కవలసిన మొదటి తరగతి పెట్టెలో గాంధీ ఎక్కగా సామానుతోపాటు గాంధీని కూడా లాగిపార వేశారు. అన్ని రంగాలలో శ్వేతజాతీయులకు అత్యధిక ప్రాధాన్యత, ప్రత్యేకతలు ఉండటం గాంధీజీ గమనించారు.

జాతి విచక్షణ విధానంతో భారతీయులపై అనేక అత్యాచారములు చేస్తున్నారు. స్వయంగా అనుభవించిన గాంధీ జాతి విద్వేష విధానానికి వ్యతిరేకంగా శాంతియుత పోరాటాన్ని సాగించాలని నిశ్చయించుకొన్నారు. భారతీయులను, ఆసియా దేశస్థులను ఈ పోరాటాలలో పాల్గొనడానికి గాంధి సమీకరించారు. ఈ పోరాటాలలో కార్మికుల పాత్ర ప్రధానమైనది.

దక్షిణాఫ్రికాకు వలస వెళ్ళిన కార్మికులు, కొంతకాలం పనిచేసే కాంట్రాక్టు కార్మికులు వేలాదిమంది వెళ్ళుతూ ఉండేవారు, బొగ్గుగనులలో, తోటలలో పనిచేసేవారు. దక్షిణాఫ్రికాలో గాంధి ఉద్యమానికి కార్మికులు అండదండగా నిలబడినారు. కార్మికుల సంక్షేమానికి జరిగిన పోరాటాలలో గాంధీ నిలబడినారు. భారత కార్మికులు 3 పౌండ్ల పోల్‌టాక్సుకు నిరసనగా సమ్మె చేశారు. న్యూకాబిర్ బొగ్గు గనులలోని భారత కార్మికుల సమ్మెను గాంధీ బలపరచినారు. న్యాయమైన కార్మికుల కోర్కెను ఆయన ఎప్పుడూ బలపరచేవారు. ట్రాన్స్‌వార్ జైత్రయాత్రలో గాంధి వెంట రెండువేల మంది కార్మికులు పాల్గొన్నారు. అనేక కష్టాలకు గురి అయినారు. కార్మికుల సమస్యలపై న్యాయస్థానాలలో వాదించడము వలన కూలీ బారిష్టరు అనేవారు.

దక్షిణాఫ్రికాలో రెండు దశాబ్దాలు జాతి విద్వేషానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి కొంతవరకు కృతకృత్యులై గాంధీజీ 1915లో భారతదేశం తిరిగి వచ్చారు. గోఖ్లే సలహామేరకు సంవత్సరంపాటు భారతదేశం అంతా తిరిగి పరిస్థితులను తెలుసుకొన్నారు. కార్మికుల, రైతుల సమస్యలను ఆకళింపు చేసుకొన్నారు. 1917లో నీలిమందు తోట యజమానులకు వ్యతిరేకంగా చాంపరాన్‌లో రైతుల ఉద్యమాన్ని నడిపి రైతాంగానికి అండగా నిలబడ్డారు. 1918లో రైతుకూలీల కొరకు ఖేడాలో సత్యాగ్రహము సడిపించారు. అహ్మదాబాద్ మిల్లు కార్మికుల బోనస్ విషయమై వచ్చిన వివాదంలో గాంధీ, వల్లభాయిపటేల్ మధ్యవర్తులుగా ఉండి, మిల్లు యజమానులతోనూ, కార్మికులతోనూ మాట్లాడగా 35 శాతం పెరుగుదలకు ఒప్పుకొనడానికి ముందు యజమానులు అంగీకరించి తరువాత 20 శాతం కంటే ఎక్కువ ఇవ్వలేమన్నారు. కార్మికులు సమ్మె చేశారు. గాంధీ వారిని బలపరిచారు. సమ్మె వలన కార్మికులు పస్తుండవలసి వచ్చింది. దొంగ కూలీలను యజమానులు ప్రోత్సహిస్తున్నారు. గాంధీ నిరాహార దీక్ష ప్రారంభించారు. మూడు రోజుల తరువాత యజమానులు కార్మికుల కోర్కెలను అంగీకరించారు. 35 శాతం పెంచడానికి ఒప్పుకొన్నారు.

కార్మికుల న్యాయమైన పోరాటాన్ని సాగించుటలో గాంధీ అవలంబించిన పద్ధతి తక్షణం ప్రజలకు నచ్చుతుందనీ, సమరశీల చర్యలకు కార్మికులు దిగకుండా అపుతుందని మిల్లు యజమానులు అర్థం చేసుకొన్నారు. కార్మికుల ఓర్పుకు ఒక హద్దు ఉంటుందని, ఆ హద్దు దాటి పోయాక ప్రమాదం ఉందని గ్రహించిన గాంధిజీ నిరాహార వ్రతానికి ఉపక్రమించారు. ఒక సామాజిక సంఘర్షణ ఉన్నతమైనప్పుడు ఆయా వర్గాల ప్రవర్తన ఏమిటో గాంధిజీ అర్థం చేసుకోగల్గినా, బాధితులైన కార్మికులే మరింత అహింసాయుతంగా ప్రవర్తించాలని గాంధి భావన.

భారతదేశంలో ప్రజల ఆశయం కోసం సాగించిన నిరాహార వ్రతం కార్మికుల పోరాటాలతోనే ప్రారంభం అయినది. అదే మొదటిది.

గాంధీజీ తాను అనుసరించిన లోకోత్తర మహత్తర సత్యాగ్రహ పద్ధతిని ముందు రైతుల సమస్యల పరిష్కారానికి, కార్మికుల కోర్కెల సాధనకు ప్రయోగించి జయమును సాధించారు.

తిలక్ మరణానంతరం 1920లో గాంధిజీ కాంగ్రెసుకు నాయకత్వము వహించారు. 1920, 21లో కార్మికోద్యమమునకు ఒక రూపము ఇవ్వబడినది.

లాలా లజపతిరాయ్ ఆధ్వర్యాన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఏర్పడింది. కార్మికుల సమ్మెలు 1919లో 19 కాగా, 1920లో 200; 1921లో 400కి పెరిగాయి. 1921లో కాంగ్రెసు కార్మికోద్యమానికి ప్రత్యేక కమిటీని నియమించింది.

అస్సాంలో టీ తోటల యజమానులైన బ్రిటిషువారు విపరీతంగా లాభాలు గడించినా, తోటలలో పనిచేసే కూలీలను వేలాదిమందిని తొలగించారు. కొంపల నుండి తరిమివేశారు. స్టీమర్లపై వెళుతున్న కార్మికులను నదిలో పడవేశారు. దాంతో క్రోధావేశాలతో రైలు, స్టీమర్లలో పనిచేసే కార్మికులు నిరసనగా సమ్మె చేశారు. కాంగ్రెసు ఆ పోరాటాన్ని బలపరచి కార్మికుల క్షేమానికి తోడ్పడింది. గాంధిజీ ఎప్పుడూ కార్మికుల క్షేమాన్ని, పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేసేవారు. కార్మికులందరినీ స్వాతంత్ర్య పోరాటాలలో భాగస్వాములను చేశారు. గాంధీజీ తను కలలుగన్న భారతదేశం ఎలా వుండాలో ఈ విధంగా వర్ణించారు.

‘‘అందరికన్నా అతి బీదవాళ్ళు సైతం ఈ దేశం తమ దేశమని భావించాలి. ఆ దేశ నిర్మాణంలో వాళ్ళ వాణికూడా విన్పించాలి. పై తరగతి, క్రింద తరగతి ప్రజలు అనే భేదముండరాదు. అన్ని కులాలు, మతాలవారు పరిపూర్ణ సామరస్యంతో జీవించాలి. ఇవన్నీ వుండే భారతదేశం కోసం నేను కృషి చేస్తాను. ఇది నేను కలలుగనే భారతదేశం’’ అన్నారు గాంధీజీ.

గాంధీజీ తన 18 అంశాల నిర్మాణ కార్యక్రమంలో కార్మికుల సంక్షేమము ఒక అంశంగా చేసి వారికి అండగా నిలబడినారు.

యజమాని, కార్మికుడు ఒకే కుటుంబంగా భావించి, కృషి చేసినప్పుడే పరిశ్రమల అభివృద్ధి, కార్మిక సంక్షేమము సాధ్యము అవుతాయి. కార్మికులు సంతృప్తిగా ఉంటేనే ఉత్పత్తికి తోడ్పడగలుగుతారు. ఉత్పత్తి పెరిగితేనే యజమానులు లాభాలు గడించగలుగుతారు. గడించిన లాభాలు యజమానులతోపాటు కార్మికులు కూడా అనుభవించాలి. శ్రామిక పురోభివృద్ధికి సంతృప్తికరమయిన పరిష్కారానికి గాంధీజీ ఇలా అన్నారు.

1) శ్రామికుడు కొన్ని గంటలు పనిచేస్తే కొన్ని గంటలు విశ్రాంతి ఉండాలి.

2) విద్యార్జన, విజ్ఞాన సముపార్జనకు తగు సౌకర్యాలు కలుగ జేయాలి.

3) వారి పిల్లలకు పాలు, బట్టలు ఇచ్చి విద్యాసౌకర్యాలు కలుగ జేయాలి.

4) ఆరోగ్యకరమైన నివాస వసతులు కలిగించాలి.

5) వృద్ధాప్యంలో వారి పోషణకు నిధులు సమకూర్చాలి.

తక్కువ కూలీతో ఎక్కువ పని చేయించాలని యజమానులు, ఎక్కువ కూలీతో తక్కువపని చేయాలనే కార్మికుల ప్రయత్నాలు దేశ పురోభివృద్ధికి తోడ్పడవు. హక్కులకొరకు పోరాటము చేయాలనే ఆరాటమున్నట్లే తమ విధుల నిర్వహణలో కూడా శ్రద్ధచూపాలి. బాధ్యతాయుతంగా విధినిర్వహణలో నిమగ్నము కావటం వలన ఉత్పత్తి సంపద పెంచడానికి తోడ్పడగలరు. సంపద పెరిగినప్పుడు యజమానులు కష్టపడిన కార్మికుల సంక్షేమానికి తోడ్పడాలి. అలా చేసినప్పుడు కార్మి కుల యజమానుల సత్సంబంధాలు పెరిగి దేశప్రగతికి తోడ్పడినవారవుతారు. యజమానులు కార్మికుల సంక్షేమానికి తోడ్పడనపుడు సమ్మెలు అనివార్యము అవుతాయి.

సమ్మెల విషయమై గాంధీజీ ఇలా అన్నారు.

1) సమ్మె కారణం న్యాయసమ్మతంగా ఉండాలి.

2) సమ్మెదార్ల మధ్యన కార్యక్రమాచరణలో ఏకీభావం వుండాలి.

3) సమ్మెలో చేరనివారలపై దౌర్జన్యం చేయరాదు.

4) సమ్మెకాలంలో సమ్మెదార్లు కార్మిక సంఘపు విరాళములపై ఆధారపడకుండా తమల్ని తాము పోషించుకోగలగాలి. అందులకు ఉపయోగకరము, లాభకరము అయిన ఏదో ఒక తాత్కాలిక వ్యాపకం చేకూర్చుకోవాలి.

5) యజమానులలో పరివర్తన వచ్చి కార్మికులలో న్యాయమైన కోర్కెలు అంగీకరించునట్లు ఆహింసాయుత పద్ధతుల ద్వారా పోరాటము నడపాలి.

యజమానులు తమ పరిశ్రమలలో లాభాలను గడించడానికి కార్మికుల కృషి కారణమని భావించాలి. వారి క్షేమానికి తోడ్పడి వారికి ప్రోత్సాహం ఇవ్వాలని, తమ ఆస్తులకు వారు ధర్మకర్తలుగా భావించాలని గాంధీజీ అన్నారు.

పాటుపడేశక్తి ఉండియు పనిగాని, తిండిగాని దొరకని పురుషుడుకాని, స్త్రీ కాని దేశంలో ఒక్కరయినా పున్నంతకాలం మనము విశ్రాంతి తీసుకొనడానికి గాని, కడుపునిండా తిసటానికి గాని సిగ్గుపడవలసి వుంటుందన్న గాంధీజీ మాటలు మనమంతా గుర్తుపెట్టుకోవాలి. శ్రమ శక్తిని ఉపయోగించి దేశ ప్రగతికి, సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలి. అదే గాంధీ సందేశం. అదే మనందరి కర్తవ్యం.

[మే 1వ తేదీ మేడే శతవార్షికోత్సవ సందర్భంగ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారము చేయబడినది.]

5. నిర్మాణ కార్యక్రమము - గాంధీజీ

భారతదేశ స్వాతంత్ర్య సాధనకు సత్యము, అహింస, త్యాగములతో కూడిన లోకోత్తర మహత్తర పద్ధతిలో లక్షలాది ప్రజలను సమీకరించి రవి అస్తమించని సామ్రాజ్యాధిపతులపై పోరాటాలను సల్పుతూ గాంధీజీ స్వతంత్ర భారతదేశంలో ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించుటకు సంసిద్ధతగా నుండుటకునూ, దేశంలోని పేదరికం, నిరక్షరాస్యతల నిర్మూలనకు, సమైక్యత, సుహృద్భావాలను పెంచుటకును, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ప్రజలను ఆయత్తము చేయుటకు, సేవాశక్తిని, సమాజ సేవాభిలాషను పెంపొందించడానికి 18 సూత్రాల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు.

వినోబాభావే వంటి పెద్దలు నిర్మాణ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తే. పండిత నెహ్రూ లాంటి రాజకీయవేత్తలు స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించారు. గాంధీజీ ఎంత నిర్మాణాత్మకమైన దూరదృష్టి కలవారో మనకు తెలుస్తుంది.

సత్యాగ్రహమును జాతీయ స్థాయిలో స్వాతంత్ర్యము కొరకు ప్రయోగించక ముందు ఆది అహ్మదాబాద్ మిల్లు కార్మికుల జీతాల పెంపుకు, బార్డోలీ, ఖైరా జిల్లాలలో రైతుల సమస్యల పరిష్కారానికి తోడ్పడింది. ఉప్పుసత్యాగ్రహానికి జాతీయ స్థాయిలో సత్యాగ్రహ ఆయుధాన్ని ఉపయోగించారు. అన్ని ఉద్యమాలకు సత్యాగ్రహాన్ని ఉపయోగించారు.

1916లో కాశీ విశ్వవిద్యాలయం శంకుస్థాపన సమయంలో ''ఆంగ్లేయులు భారతదేశాన్ని విడిచిపెట్టాలి'' అని చెప్పిన నాటి నుండి 1942 ఆగస్టు, 9వ తేదీన ''క్విట్ ఇండియా'' తీర్మానముతో అనేక స్థాయిలలో జరుగుతూ వచ్చిన స్వాతంత్ర్యోద్యమము చరమస్థాయికి చేరింది. ఆగస్టు విప్లవ అంతిమ పోరాటంతో బ్రిటిష్‌వారు వెళ్ళిపోయారు. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. గాంధీజీ రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించారు. వాడవాడలా ప్రజలంతా స్వాతంత్ర్యోద్యమమును వైభవంగా చేసుకుంటుంటే గాంధీజీ భోజనం చేయక,

మంచినీరు అయినా ముట్టకుండా ఎవరితోనూ మాటాడకుండా మౌనంగా వుండి తనమీద ఏదో బృహత్తరమైన భారం పడినట్లు క్రుంగిపోతూ కనిపించారు. ఆ మరునాడు మన నాయకులు కలుసుకొని ''ఏం మహాత్మా, ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాప్రదాతవు, జాతిపితవు ఎందుకు ఇలా బాధపడుతున్నావు?'' అని అడిగినారు. ''నేను కోరిన రాజ్యం ఇదికాదు. బ్రిటిషువారు పోయి భారతీయులు రాజ్యానికి వచ్చారు. ఈ దేశంలో ప్రతివారికి తినడానికి తిండి, కట్టుకొనడానికి గుడ్డ, ఉండటానికి ఇల్లు, విద్య సౌకర్యాలు కలుగజేసినప్పుడు మాత్రమే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు గాంధీజీ. "దీనిని సాధించడానికి మనదేశాన్ని పరిపాలించుటకు మనకు అవకాశం కల్గింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు మనము ఇంకా ప్రయత్నించాలి. అందులకే నా ఆలోచన'' అన్నారు గాంధీజీ.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ విభజన వలన వచ్చిన జనాభా మార్పిడి, మతకలహాల వలన మారణహోమాన్ని ప్రభుత్వం ఎదుర్కొనవలసి వచ్చింది. మతకలహాలకు గాంధీజీ ఆందోళనచెంది నవఖాళీలో పాదయాత్ర చేసి చివరకు హిందూ, ముస్లిం సమైక్యతకు నిరాహార దీక్ష చేశారు. కల్లోలాలు తగ్గిపోయాయి. గాంధీజీ ఢిల్లీలో ఉండి, ప్రతిరోజూ ప్రార్థనా సమావేశాలలో దేశప్రజల ప్రభుత్వం కర్తవ్యాన్ని గురించి బోధిస్తున్నారు. శత్రువుని కూడా మిత్రునిగా చూచే శాంతిదూత గాంధీజీ. 1948 జనవరి 30వ తేదీ సాయంత్రము 6 గంటలకు ప్రార్థనా సమావేశానికి వెళుతూవుండగా 'గాడ్సే' అనే హిందూ మతోన్మాది గాంధీకి నమస్కరించి పిస్టల్‌తో కాల్చివేశాడు. మానవాళికి 'జ్యోతి'గా ప్రకాశించిన గాంధీజీ ఆ సాయంత్రము రవితోపాటు అస్తమించారు. జ్యోతి ఆరిపోయింది. సభ్యతా ప్రపంచము గాఢాంధకారంలో మునిగిపోయింది. గాంధీజీ శారీరకంగా మన మధ్య లేరు. పంచభూతాలలో లీనమైపోయారు. కాని వారి మహోన్నత ఆశయాలు, మహత్తర కార్యాచరణ విధానాలు మనతోపాటు ఉన్నాయి. మానవతగల ప్రతివారి హృదయంలోనూ ఉన్నారు. ఉంటారు. గాంధీజీ ప్రపంచము ఉన్నంత వరకూ ఆయన చూపిన మార్గాలుంటాయి. "గాంధీజీ పోయారుకాని గాంధీజం ఎప్పుడూ

ఉంటుం''దని డా॥ పట్టాభి అన్నారు. మనకు దారి చూపిన ఆ కాంతిపుంజము ఆరిపోదు. వెయ్యి సంవత్సరాల తర్వాత కూడా భారతదేశానికే కాక ప్రపంచానికే వెలుగు బాటగా వుండగలదు అన్నారు శ్రీ నెహ్రూ.

స్వాతంత్ర్య సమరాలతోపాటు గాంధీజీ సూచించిన నిర్మాణ కార్యక్రమములోని చాలా అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, సమాజ వికాస, సంఘ సంక్షేమ కార్యక్రమాల క్రింద అసలు జరుపుతూ వస్తున్నాయి. వాటికి ప్రజలలో ప్రచారానికి, అమలుకు సంఘ సేవకులు, సమాజ సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇంకా కృషి చేయవలసి వుంది. గాంధీజీ నిర్మాణ కార్యక్రమములో ముఖ్యమైనవి సామాజిక మార్పుకు ప్రయత్నించేవాటికి సంబంధించినవి.

1. సమైక్యత :

ఈనాటికీ ఆయన నిర్మాణ కార్యక్రమము అవసరమైనది. ఆచరణీయమైనది. జాతి సమైక్యతకు, దేశ సమైక్యతకు నేటికి అవసరమైనదే. గాంధీజీ చెప్పిన సమైక్యతా ప్రాధాన్యత ఎంతైన ఉంది. జాతి సమైక్యతకు 1948లో గాంధీజీ, దేశ సమైక్యతకు 1984లో ఇందిరా గాంధీ ప్రాణత్యాగాలు చేశారు. వారి ఆశయాలైన జాతి, దేశ సమైక్యతలను నిలపెట్టడానికి ప్రతి భారతీయుడు ప్రతిజ్ఞ తీసుకోవాలి. కృషి చేయాలి.

2. అస్పృశ్యతా నివారణ :

ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయి. ఈ నాటికీ హరిజనులపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలు రోజూ పేపర్లలో చూస్తూనే వున్నాము. హరిజనులని పేరు పెట్టి అస్పృశ్యతా నివారణకు ఉద్యమాలు నడిపి గాంధీజీ చేసిన హరిజన సేవ సమాజంలో ఎంతో మార్పు తీసుకొని వచ్చింది. అయినా వారి ఆశయములు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. శాసనసభలలో, అధికారములో వారికి అవకాశాలు ఇచ్చినా సమాజంలో ఇంకా మార్పు రావలసి ఉంది. అందులకు సమాజసేవకులు, సంఘ సేవా పరాయణులు కృషిచేయవలసి ఉంది.

3. విద్యావిధానం :

క్రమశిక్షణ, కష్టపడటం, దేశభక్తి, పనియందు ఆసక్తి, స్వయం ఉపాధి కల్గే విధంగా గాంధీజీ నూతన విద్యా విధానాన్ని రూపొందించారు. దానిని బేసిక్ విద్య అంటారు. అయితే ఈనాటికీ మన ఆశయాలకు అనుగుణమైన విద్యావిధానం కోసం అన్వేషిస్తూనే వున్నాము. మెకాలే విద్యావిధానం మన దేశానికి పనికిరాదని అందరం అంటున్నాము. కాని సరియగు రూపానికి తీసుకొని రాలేకపోతున్నాము. నూతన విద్యా విధానాన్ని రూపొందించాలని ప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీ ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నము సఫలం కావాలని కోరుకుందాము.

4. వయోజన విద్య :

దేశంలో జనాభా పెరుగుతోంది. పేదరికం, నిరక్షరాస్యత తరుగుటలేదు. పేదరికం తొలగాలంటే ప్రజలలో నిరక్షరాస్యత తరగాలి. దేశసంపద పెరగాలి. ఎంత ఖర్చు పెట్టినా వయోజన విద్య వలన అనుకొన్నంత ఫలితం రావటంలేదు. ఈనాటికీ సేవాభావంతో వయోజన విద్యావ్యాప్తికి కృషిచేయవలసివుంది. నిరక్షరాస్యతను తగ్గించడానికి ఒక ఉద్యమములాగ నిర్వహించాల్సి ఉంది.

5. మద్యనిషేధం :

స్వాతంత్ర్య పోరాటాలలో మద్యనిషేధం ఉద్యమము ప్రత్యేకత సంతరించుకొన్నది. అనారోగ్యం, అజ్ఞానం, అవిద్య, పేదరికం, పెంచే మద్యపానమును నిషేధించాలని ప్రజల క్షేమం దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వాలు మద్యనిషేధం 'పెట్టి అమలుపరచుటకు సాధ్యంకాక నెమ్మదిగా ఎత్తివేయడం జరిగింది. ప్రభుత్వ ఆదాయాలకు ప్రధానమైనందున తిరిగి ఆలోచించ లేకపోతున్నారు. సామాజిక, నైతిక విలువలను ప్రజలలో పెంచాలంటే మద్యనిషేధం ఎంతైనా సంఘసేవాసంస్థలు, సామాజిక సేవా కార్యకర్తలు ప్రజలలో మద్యపానంవల్ల వచ్చే నష్టాలను ప్రచారంచేసి సామాజిక మార్పును తీసుకురావాలి.

6. పారిశుద్ధ్యం :

ఇంట్లోగాని, పట్టణంలోగాని పారిశుద్ధ్యం ఎంతేని అవసరం. ఇంట్లోను, పరిసరాలు, పరిశుభ్రంగా వుంటేనే ఆరోగ్యానికి, ఆహ్లాదానికి అవకాశం కల్గుతుంది.

కొన్ని ప్రాంతాలలో ముక్కుమూసుకొని, కండ్లు మూసుకొని వెళ్ళేటటువంటి దుర్గంధము, అసహ్యకరమైన చెత్త, చెదారం ఉంటుంది. అంటువ్యాధులకు ఆధారం అవుతున్నాయి. ప్రజలకు ఎంతో కీడు కల్గిస్తుంది. అందుచే గాంధీజీ సూచించిన పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పుడూ ఆచరించవలసిందే. ఎవరికివారు తోడ్పడితేగాని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచలేము.

7. స్త్రీలు :

స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలకు ప్రాధాన్యత ఇచ్చి గాంధీజీ సమాజంలో స్త్రీలకు గౌరవాన్ని తెచ్చారు. పురుషులకు, స్త్రీలకు సమాన అవకాశాలు యివ్వాలని, మాతృమూర్తులైన స్త్రీలు గౌరవించబడాలని గాంధీ అనేవారు. ఈనాడు వరకట్నాల సమస్యల వలన, ఇతర కారణాల వలన ఇంకా స్త్రీలు వేధించబడుతూనే ఉన్నారు. నిర్మాణ కార్యక్రమములో గాంధీజీ స్త్రీల సమస్యలపై యిచ్చిన ప్రాధాన్యం నేటికీ వుంది.

ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమీషన్ ద్వారా గ్రామీణ పరిశ్రమలకు ఈనాడు ప్రాముఖ్యం వుంది. ఖాదీకి ప్రాముఖ్యం ఇవ్వడం వలన ఈనాటికీ పేదల జీవనోపాధికి తోడ్పడిన వారమగుచున్నాము. హిందీ జాతీయభాషగా పేర్కొనడం వలన సంధానభాషగా హిందీ వ్యాప్తి అవసరం అగుచున్నది. గిరిజనుల సంరక్షణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

గాంధీజీ నిర్మాణ కార్యక్రమములో అనేక అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ శాఖల ద్వారా అమలు జరుపుతున్నాయి. సంఘ సేవకులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, కార్యకర్తలు వాటిని జేయుటకు తోడ్పడవలసి వుంది. అందుచే గాంధీజీ నిర్మాణ కార్యక్రమము అమలుపరుచుటలో సమాజ వికాసాన్ని కల్గించుటకు కృషి చేస్తూనే వుండాలి. గాంధీ ఆశించిన సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించే వరకూ నిర్మాణ కార్యక్రమము ఏదోరూపంలో ప్రభుత్వంచేగాని, ప్రజలచే గాని అమలు జరుపబడుతూనే వుండాలి.

ప్రతివారు సోమరితనాన్ని నిర్లిప్తతను వదలి కష్టపడి పనిచేసి ఏదో విధంగా ఉత్పత్తికి తోడ్పడాలి. దేశభక్తి సమాజ శ్రేయస్సు ద్వారా దేశ పురోభివృద్ధికి తోడ్పడుటే నిర్మాణ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యం.

గాంధీజీ నిర్మాణ కార్యక్రమము నేటికీ అనుసరణీయమైనది. ఇందిరాగాంధీ ఇరువది సూత్రాల పథకం కూడా దేశపురోభివృద్ధికి ముఖ్య దృష్టితో దేశసంపద పెంచడానికి ఉద్దేశించబడింది. అదికూడా ఒక నిర్మాణయుతమైన కార్యక్రమములతో కూడినదే.

6. నిర్మాణ కార్యక్రమము నాడు - నేడు

''నేను రాజ్యముకోరను, స్వర్గముకోరను, పునర్జన్మ లేకుండుట కోరను. నేను కోరునది ఆర్తినాశనం'' అన్నారు గాంధీజీ. ఈ పవిత్ర భారతదేశంలో ఆకలితో, దుఃఖంతో అలమటించేవారెవ్వరూ ఉండరాదని మహాత్ముని ఆశయం. ప్రతివారికి కనీస అవసరాలు తినడానికి తిండీ, కట్టుకోవటానికి బట్ట, ఉండటానికి ఇల్లు, విజ్ఞానానికి విద్య, ఆరోగ్యానికి వైద్య సదుపాయాలు కలిగి ఉండి సుఖశాంతులతో తులతూగే రామరాజ్యంగా మనదేశం వర్థిల్లాలని గాంధీజీ ప్రగాఢవాంఛ.

మానవతకు విలువ, ప్రతివారికి సమాన అవకాశాలు కలిగిన ప్రజల రాజ్యం ఏర్పడాలని బాపూజీ ఆలోచన. ఈ ఆశయసాధనకు మనదేశాన్ని మనం పరిపాలించుకోవాలంటే, మనలను బానిసలుగా చేసి పరిపాలిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వం తొలిగిపోవాలని స్వాతంత్ర్య పోరాటం నడిపించారు. రవి అస్తమించని సామ్రాజ్యాధిపతులతో పోరాటం చాలా కష్టతరమైనది. ఆయుధాలుగాని, ఆర్థిక సంపదగాని లేని ప్రజలు ఏ విధంగా పోరాటం చేస్తారు? క్రీస్తు, బుద్ధుడు ప్రభోధించిన సత్యము, అహింస, త్యాగము వీటిని ఆధారంగా తీసుకొని లోకోత్తర, మహత్తర సత్యాగ్రహ పద్ధతులను గాంధీజీ అనుసరించి స్వాతంత్ర్య పోరాటం నడిపారు.

ఒకప్రక్క సామ్రాజ్యాధిపతులలో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తూనే, రెండవప్రక్క ప్రజాక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ కార్యక్రమం అమలును ప్రబోధిస్తూ వచ్చారు. ''ఉపాధి-ఉత్పత్తి'' ఆశయంగా గ్రామీణ ఆర్థికాభివృద్ధి, ''విజ్ఞానము-వికాసము'' ఆధారంగా విద్యా సాంస్కృతికాభివృద్ధి ''స్వావలంబన స్వయం పోషకత్వం'' ఆశయంగా సమాజ వికాసం, ''సమైక్యత.. సద్భావం'' కలిగిన సర్వధర్మ ప్రచారం, ''దురాలోచన దురలవాట్లు'' నివారించే సంఘ సంస్కరణం కలిగిన 18 అంశాల నిర్మాణ కార్యక్రమాన్ని గాంధీజీ దేశానికి అందజేశారు.

కదురు-కవ్వము ఆడితే కరువు ఉండదని, పాడిపంటలతో దేశం తులతూగుటకు నిర్మాణ కార్యక్రమం అమలు చేయాలన్నారు. గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేయుటకు లక్షలాది ప్రజలు ముందుకు వచ్చారు.

ఒకవైపు విదేశ రాజ్యాధిపతులను వెళ్ళగొట్టడానికి త్యాగంతో పోరాటాలు సాగిస్తూనే రెండవవైపుల స్వదేశంలో స్వయంపోషకత్వాన్ని ప్రబోధిస్తూ నిర్మాణాత్మకమైన కార్యక్రమం అమలు పరిచేందుకు గాంధీజీ కృషిచేశారు. స్వాతంత్ర్య పోరాటంవల్ల త్యాగం సేవాభావం, నిర్మాణ కార్యక్రమం వల్ల కష్టపడి పనిచేయడం, సహసం ప్రజలు అలవరుచుకోవడానికి అవకాశం కలిగింది.

నిస్స్వార్థ, నిష్కళంక దేశభక్తితో త్యాగంచేసి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారు. ప్రజలచేత ఎన్నుకోబడి ప్రజలక్షేమానికి కృషిచేసి ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారు. గాంధీజీ ఆశయం నేరవేరాలంటే, మన రాజ్యాంగం విజయవంతం కావాలంటే ప్రజా ప్రతి నిధులు నిస్స్వార్థంగా, నిర్విరామంగా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. ప్రజలు వారి విధ్యుక్త ధర్మాన్ని దీక్షగా నిర్వహిస్తూ సంపాదించిన ధనాన్ని పొదుపు చేసుకుంటూ, దురలవాట్లకు దూరంగా ఉంటూ దారిద్రాన్ని తొలగించడంలో కృషి చేయవలసి వుంది.

స్వరాజ్యం వచ్చి 38 సంవత్సరాలు అయింది. అనేక ప్రణాళికల ద్వారా దేశం అప్రతిహతంగా పురోగమించింది. ఎంతో అభివృద్ధిని సాధించింది. కానీ ఈనాటికీ దేశంలో నూటికి 60 మంది పేదరికంలో ఉన్నారు. ఒకపూట తిని, ఒకపూట తినక, పిల్లలకు పెట్టి తల్లులు పస్తుండి దారిద్ర్యంతో అలమటించే వారెందరో ఉన్నారు. గాంధీజీ ఆశించిన విధంగా ప్రతివారికి కనీస అవసరాలు తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్య సౌకర్యాలు ఏనాడు సాధించి పెట్టగలమో!

స్వరాజ్యం వచ్చిన తరువాత త్యాగం, సేవాభావం తరిగి, స్వలాభం, సోమరితనం పెరిగిపోయాయి. కష్టపడకుండ సంపాదించాలనే వాంఛ ప్రబలింది. కష్టపడేవారు ఒకరు, అనుభవించేవారు మరొకరు అవుతున్నారు.

సమాజంలో వర్గకలహాలు, దోపిడీలు, అవకాశవాదాలు ఎక్కువ అవుతున్నాయి. దోపిడీ చేసిన ఇతర దేశస్థులను పారద్రోలాము. ఇప్పుడు మనదేశంలో మనవారే దోపిడీ చేస్తున్నారు, కొల్లగొడుతున్నారు. సామ్రాజ్యాధిపతులు కాలగర్భంలో కలిసిపోయినా, స్వతంత్ర రాజులు మటుమాయమయినా, జమీందారీ, జాగిర్దారీలు రద్దయినా, భూస్వాముల ఆధిపత్యాలు తరిగినా, ఆదాయం, సంపదలపై పన్ను విధించినా దళారీలు, దోపిడీదారులు, స్మగ్లర్లు, దొంగవ్యాపారస్థులు సామాన్య ప్రజలను పీల్చిపిప్పి చేస్తూనే ఉన్నారు. ధనశక్తితో నూతనవర్గం దేశంలో ఆవిర్భవించింది. ఆ డబ్బుతో రాజకీయ, సాంఘిక రంగాలను అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అందుకే గాంధీజీ ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. నీపు సంపాదించింది నీది కాదు, నీవు సంపాదించిన ఆస్తికి నీవు ధర్మకర్తవు మాత్రం సుమీ'' హెచ్చరిక చేశారు. దేశంలో అనినీతి, ఆశ్రితపక్షపాతం, స్వార్థం పెరిగిపోయి సామాన్యప్రజల జీవితం దుర్భరంగా తయారయింది. ఏ ప్రజల కోసం స్వాతంత్ర్యం వచ్చిందో ఆ ప్రజలు అభివృద్ధి చెందకుండ అనేక ఆటంకాలు కలుగుతున్నాయి.

ఆ అవరోధాలను తొలగించే వారెవ్వరు? ఆనాడు త్యాగం, సేవాభావంతో పనిచేసిన కార్యకర్తలు ఏరి? ఈనాడు ఆ నాయకులు ఎచట? ఇప్పుడు ఎవరున్నారు? ఈ కలుషిత అంధకార వాతావరణంలో వెలుగు చూపేదెవ్వరు? అటువంటి మహాత్ములు ఎచట?

సమాజ సేవకు నిష్కళంక దేశభక్తులు ముందుకు రావాలి! నేటి యువకులలో త్యాగం, సేవాభావం అలవడునట్లు చేయాలి.

స్వాతంత్ర్య ప్రదాత గాంధీజీయే మనకు వెలుగుబాట. వారినిర్మాణ కార్యక్రమమే మనకు రాచబాట, త్యాగంలేనిదే ఏ దేశం ముందుకు నడువదు, కష్టపడనిదే ఏ దేశం అభివృద్ధి చెందదు, నిర్మాణాత్మక కృషి లేనిదే ఏ సమాజానికి మనుగడలేదు.

సర్వకాలాలలో సమాజ వికాసానికి, క్షేమానికి, ఆర్థిక స్తోమతను పెంచి పేదరికం తొలగించేందుకు నిర్మూలన దృష్టి నుండి నిర్మాణాత్మక కృషికి తోడ్పడేది

గాంధీజీ నిర్మాణ కార్యక్రమం. వ్యక్తి, గ్రామం, ప్రాంతం, దేశం స్వయం పోషకత్వాన్ని సాధించాలంటే గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేయటం అవసరం. ఆర్థికస్తోమతను పెంచాలన్నా, అందరికి సమాన అవకాశాలు కలిగించాలన్నా గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరుపుదాం.

సంఘ సేవకులు, స్వచ్ఛంద సేవాసంస్థలు ముందుకు రావాలి! నేటి దేశ దుర్భర పరిస్థితులను గురించి పరిశీలించాలి. ఆలోచించాలి. త్యాగం, సేవాభావం అలవరచుకోవాలి. గాంధేయమార్గంలో స్వార్థం, సోమరితనం, అవినీతి, దోపిడీలపై పోరాటం సాగించాలి. ఆనాడు త్యాగం చేసి మనపెద్దలు స్వరాజ్యాన్ని సంపాదించారు. ఈనాడు త్యాగంచేసి మనం సురాజ్యాన్ని సాధించుదాం.

ఇదే ఈ నాటి మన కర్తవ్యం.

ఇదే మన ప్రతిజ్ఞ.

నా ఆశయాలనూ, నా కార్యక్రమాన్నీ తమ నిత్యజీవితంలో ఆచరించేవారినీ లేదా వాటిలో నమ్మకంలేక నన్ను విమర్శించేవారినీ, నాపట్ల అత్యంత గౌరవభావంగల మిత్రులుగా నేను పరిగణిస్తాను.

- గాంధీజీ

7. అన్నివాదాలకన్నా గాంధేయవాదం మిన్న

బెన్‌థామ్, మిల్‌ల యొక్క ఉపయోగ సిద్ధాంతాలవలనగాని : మార్క్స్, లెనిన్‌ల విప్లవపద్ధతివలనగాని; హబ్స్ యొక్క ప్రకృతి అభిముఖంగా తిరోగమించడమనే ఆశావాదంవలనగాని; నీడ్జే యొక్క పరిపూర్ణ శ్రేష్ఠమానవ వేదాంతం వలన గాని నేను పొందలేకపోయిన వివేకనైతిక సంతృప్తి, గాంధీయొక్క అహింసాత్మకమైన తిరుగుబాటులో కనుగొన్నాను. ఇది ఒక్కటే నైతికంగా దళితజాతి ప్రజల స్వాతంత్ర్య సాధనకు ఆచరణీయ విధానమనే భావన నాకు కలిగింది'' అని చెప్పిన అమెరికన్ నీగ్రోనాయకుడు డా॥ మార్టిన్‌లూథర్‌కింగ్ గాంధీమార్గములో పయనించి, పౌరహక్కుల పరిరక్షణకై అహింసాయుతంగా ఉద్యమించి విజయము సాధించారు. అమెరికన్ గాంధీగా పేరొంది నోబెల్ బహుమతిని పొందిన డా॥ మార్టిన్‌లూథర్‌కింగ్ ఎంతో పరిశీలన తరువాత అనుభవంతో చెప్పిన పై మాటలు ఎంతో విలువైనవి. గాంధీ యొక్క మహత్తర సత్యాగ్రహ పోరాటములు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని కదిలించి వేశాయి. అప్పటివరకు రక్తపాతంతో స్వాతంత్ర్యము సంపాదించుకొన్న దేశాలు ఆశ్చర్యము చెందాయి. ఆయుధాలు, అవకాశాలు లేని పీడిత ప్రజలకు వారి సమస్యల పరిష్కారానికి మార్గము దొరికింది. జాత్యహంకారంతో తెల్లవారు నల్లజాతివారిమీద అనేక ఆంక్షలను విధించడం, సమాజంలో వారిని వేరుగా చూడటంవంటి జాతి విచక్షణా కార్యక్రమాలను ఎదిరించడానికి అమెరికాలో నీగ్రోల తరపున మార్టిన్‌లూథర్‌కింగ్ అనేక ప్రయోగాలను చూచి చివరకు మానవతకు విలువనిచ్చి సోదరభావమును పెంపొందించే త్యాగమయ సత్యాగ్రహ పోరాటాలతో కూడిన గాంధేయమార్గాన్నే అవలంబించారు. ప్రపంచములో ప్రముఖ రాజకీయ, తత్వవేత్తల సూచనలను పరిశీలించి, గాంధీ మార్గమే అత్యుత్తమమైనదని ప్రశంసించారు. ఆచరించారు.

గాంధీమార్గములో ముఖ్యాంశములు సత్యము, అహింస. ఏది అనుకొంటామో, ఏది చెప్పుతామో, ఏది చేస్తామో అదే సత్యం. ఒకే విధమైన మనో వాక్కాయ కర్మలతో కూడిన ప్రక్రియ. తోటి మానవుని ప్రేమించటం, గౌరవించడం, బాధలతో ఉన్నవారిని ఆదుకోవడం మానవధర్మం. మమతతో కూడినదే మానవత, అహింసా

సూత్రానికి మూలము. మానవుని మానవునిగా గౌరవించే మానవత్వం వలన సౌభ్రాత్రము, సామరస్యము, శాంతి వర్ధిల్లుతాయి. మానవతని మంట గలిపే అక్రమాల్ని ఎదిరించడానికి, చెడును వ్యతిరేకించడానికి గాంధీజీ సత్యం, అహింసలతో కూడిన ఆగ్రహాన్ని వెల్లడించడమే సత్యాగ్రహమన్నారు. నిజమైన ఆగ్రహంలో పోరాటము, ఇతరులను కష్టనష్టాలకు గురికాకుండా వారు చేస్తున్న ఆక్రమాలను, చెడును బహిర్గతపరచి వ్యతిరేకాన్ని వ్యక్తంచేస్తూ, చేసే అహింసాయుత పోరాటమే గాంధీ సత్యాగ్రహ పోరాటం. ఈ పోరాటములో పాల్గొనే వ్యక్తి ధైర్యము, సాహసము, ఆత్మశక్తి కలిగివుండాలి. ధర్మముకొరకు పోరాడుతున్నామనే నమ్మికకలిగి పుండాలి. మనము సాధించవలసిన ఆశయము ఎంత ఉన్నతమైనదో, ఆశయ సాధనకు మనము ఉపయోగించే మార్గము కూడా అంత పున్నతంగానూ ఉండాలి అని గాంధీజీ అనేవారు. భావిత ప్రజలకు స్వాతంత్ర్యము అనే మహత్తర ఆశయాన్ని సాధించడానికి సత్యాగ్రహము అను పోరాటసాధన కూడా లోకోత్తరమైనది. మహత్తరమైనది. క్రీస్తు, బుద్ధుడు ప్రబోధించిన అహింసా సిద్ధాంతాలకు గాంధీజీ తన సత్యవ్రతాన్ని అనుసంధానము చేసి మానవతను రక్షించడానికి నూతన మార్గాన్ని అన్వేషించారు. ఇది అణ్వస్త్రము కంటె గొప్పది.

గాంధీజీ సత్యాగ్రహ పోరాటం వలన త్యాగాన్ని, నిర్మాణ కార్యక్రమం ద్వారా నైతిక శక్తిని పెంపొందించారు. అనైతిక శక్తే భారతదేశానికి ప్రపంచంలో అపూర్వ గౌరవాన్ని సాధించిపెట్టింది. అంతర్జాతీయ రంగంలో గాంధీజీమార్గము రూపొందించిన సహజీవన సిద్ధాంతము, అలీన విధానము ప్రపంచశాంతికి దోహదము చేస్తున్నాయి. ఈనాడు అగ్రరాజ్యాలకు కూడ మన విధానాన్ని ప్రశంసింపక తప్పలేదు. గాంధేయమార్గము అంతర్జాతీయ రంగంలో విజయవంతమైనది. ఏ నైతికశక్తిని అయితే గాంధీజీ సాధించారో, ఏ నైతికశక్తి శక్తి యుక్తులతో అంతర్జాతీయ రంగంలో గౌరవాన్ని చేకూర్చిందో, భారత రాజకీయరంగంలో, ప్రజలలో ఆ నైతిక విలువలు రోజురోజుకు తరిగిపోతున్నాయి. దేశ ఔన్నత్యమునకు చెందిన ఆ నైతికశక్తిని కోల్పోతే మనము ప్రపంచ స్థాయిలో పతనము అవుతాము. దేశంలో అరాచకం ప్రబలుతుంది.

టెర్రరిజం నైతిక పతనానికి మూలము. సత్యాగ్రహానికి పూర్తిగా విరుద్ధమైన పద్ధతి. మానవతను మంటగలుపుతున్న విధానము, మనుషులను అమానుషంగా చంపడం వలన భీభత్సాన్ని సృష్టించి వారి ఆశయాలను సాధించాలని టెర్రరిజం సంకల్పం. అలాగునే నక్సలైట్ల కార్యక్రమము. మానవత్వము, మమతలను మరచిపోయి చేస్తున్న చర్యలు ఇవి. ఈ చర్యలు సమాజంలోని సమస్యలను పరిష్కరించలేవు సరికదా మరింత జటిలంగా వాటిని తయారుచేస్తాయి. అవసరమైతే ఆత్మరక్షణకు హింసామార్గమును ఉపయోగించవచ్చునని గాంధీజీ అన్నారు. మానవతను కోల్పోయి ఆకారణంగా హింసాయుత చర్యలవలన సాధించేది మారణహోమము తప్ప ఇంకేమి ఉంటుంది?

గాంధేయమార్గమే నేటికీ ఉత్తమమైనది. గాంధీజీ మార్గము శాంతికి, అభ్యుదయానికి తోడ్పడుతుందని అమెరికాలో మార్టిన్ లూథర్‌కింగ్ (అమెరికా గాంధీ), ఆఫ్ఘనిస్తాన్‌లో శ్రీ బాదషా ఖాన్ (సరిహద్దు గాంధీ), జపాన్లో పూజ్‌గురూజీ (జపాన్ గాంధీ) ఆయా దేశాలలో ఉద్యమాలను నడిపి మానవ కళ్యాణానికి తోడ్పడ్డారు.

ప్రపంచంలో అంతటా టెర్రరిజం పెరుగుతున్న ఈ రోజులలో గాంధీ మార్గమే శరణ్యమనే భావన పెరుగుతూ వుంది. త్యాగం, మానవత, సేవలతో కూడిన గాంధేయవాదమే అన్ని వాదాలకంటే మిన్న అని మార్టిన్ లూథర్ అన్నట్లు ప్రపంచానికి ఇంతకంటే గత్యంతరం లేదు.

ఇతర దేశాలు గాంధీ వాదాన్ని గుర్తిస్తున్న తరుణంలో గాంధీ మార్గాన్ని అనుసరించిన మనదేశంలో ఆ గుణం మరుగున పడుతుందని ఆందోళన పడుతున్నారు. ప్రాంతీయ, కుల, మతతత్వాలు పెరుగుతున్నాయి. వీటిని అదుపులో పెట్టాలంటే గాంధేయ మార్గమే శరణ్యం. అన్ని రంగాలలో గాంధేయతత్వాన్ని ఆచరించడానికి అందరూ ప్రయత్నించాలి.

8. విదేశాలలో గాంధీ ప్రభావం

అమెరికా దేశాధ్యక్షుడు శ్రీ రోనాల్డ్ రీగన్ 1984 సెప్టెంబరు 24న ఐక్యరాజ్యసమితిలో ఉపన్యసిస్తూ ''కిరాతకులు, హంతకులు కొన్నాళ్ళపాటు ఎదురులేనట్లుగా ఉంటారని, కాని చివరకు వారు పరాజయాన్ని పొందుతారని చరిత్ర పుటలు తిరగవేస్తే సత్యం, ప్రేమతో కూడిన మార్గమే ఎప్పుడూ గెలుపొందుతూ వచ్చిందని మహాత్మాగాంధీ చెప్పిన ఉదంతాన్ని ఉటంకిస్తూ, తన నమ్మకాన్ని, దృక్పథాన్ని యీ విధంగా గాంధీ అభివర్ణించారని నేటికీ ఇదే సరైన వాస్తవిక దృక్పథమని ఉద్ఘాటించారు.

నేనా మధ్య విదేశాలలో పర్యటించిన తరుణంలో జరిగిన అనేకానేక సంఘటనల్లో ఒక సంఘటన. 1983 అక్టోబరు 2వ తేదీన వాటికన్ నగరంలో పోప్ ఉపన్యాసం విన్న తరువాత నడుచుకుంటూ వెళుతున్నాం. ఒక ఇటలీ వృద్ధవనిత నన్ను చూచి ''గాంధీ, గాంధీ'' అంటూ ప్రక్క వారితో బిగ్గరగా చెపుతోంది. నేను ఆశ్చర్యం నుండి తేరుకొని ఆలోచిస్తే పంచె, చొక్కాతోకూడిన నా వేషధారణయే ఆమె అట్లా భావించడానికి కారణమని అనుకొన్నాం. సుప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు సర్ రిచర్డ్ అటెంబరో నిర్మించిన ''గాంధీ'' చిత్ర ప్రభావమిది. ఈ చిత్ర ప్రదర్శన విదేశీయులపైన గాంధీ ప్రభావం పడటానికి ఎంతగానో దోహద పడింది.

ఇంకొక సంఘటన అమెరికాలో జరిగింది. శ్రీ వేదాల రంగాచార్య స్వామి అర్చకులుగా ఉంటున్నారు. వారు పంచె కట్టుకొని, ఉత్తరీయం కప్పుకొని ఇంటినుండి దేవాలయానికి వెళుతుంటే మార్గ మధ్యంలో అమెరికా బాలలు ''గాంధీ, గాంధీ'' అని పిలుస్తారట. వేష ధారణనుబట్టి గాంధీపైన, గాంధీ సిద్ధాంతాలపైన విదేశాలలో చక్కని అవగాహన పెరగడం సంతోషదాయకం. గాంధీ రూపం అక్కడివారి చిత్తాలలో హత్తుకుపోయిందనడంలో అతిశయోక్తిలేదు.

ఈ రోజున గాంధీ సిద్ధాంతాలు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశాలైనాయి.

నీగ్రో నాయకుడైన మార్టిన్ లూథర్ కింగ్, గాంధీ సిద్ధాంత బీజాలను అమెరికావారి మనః క్షేత్రాలలో వెదజల్లాడు. గాంధీ సిద్ధాంతాలు అమెరికాలో

ఆదరించబడటానికి యింకొక కారణం కూడా ఉంది. అమెరికా, భారతదేశాలు రెండూ ఆంగ్లేయుల పాలన క్రింద మ్రగ్గినట్టివే. అయితే అమెరికా ఎప్పుడో స్వాతంత్ర్యాన్ని తెచ్చుకొంది. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో గాంధీ పూరించిన శంఖారావం అమెరికావారి చెవుల్లో మారుమ్రోగి భారతీయుల యెడ సానుభూతి కలగడానికి పై సంఘటన కారణమయింది.

నేను గత సంవత్సరం ఇంగ్లండు, అమెరికా, ఐరోపా దేశాలలో పర్యటించినప్పుడు గాంధీ సిద్ధాంతాలు విదేశాల్లో ఏ విధంగా చర్చించబడుచున్నవో తెలుసుకొనే అవకాశం లభించింది. గాంధీజీ అహింసా సిద్ధాంతం వారిని బాగా ఆకర్షించింది. యుద్ధాలవల్ల సంభవించే దారుణ మారణహోమం నుండి ప్రపంచాన్ని రక్షించడానికి, మానవకోటి వికాసానికి గాంధేయమార్గమే శుణ్యమని వారు నమ్ముతున్నారు.

ఇటువంటి ఆలోచనా సరళి వారిలో కలగడానికి రిచర్డ్ అటెంబరో తీసిన ''గాంధీ'' చిత్రం ఎంతగానో దోహదం చేసిందని చెప్పక తప్పదు. గాంధీ చిత్రాన్ని అహింసాత్మకమైన ఉద్యమముగా విదేశీయులు భావిస్తున్నారు.

ఈ సందర్భంగా గాంధీ సిద్ధాంతాల ప్రచారమును యూనిసెఫ్ వారు అమెరికాలో చేసిన కృషి అనన్యసామాన్యమైనది. గాంధీజీని గురించి గాంధీ చిత్రం ఆధారంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చిన్న చిన్న పుస్తకాలను ప్రచురించారు. గాంధీని గురించి మనకు తెలియని అనేక విషయాలు క్రోడీకరించి విద్యార్థులకు ఆసక్తిదాయకంగా అందించారు.

గాంధీ జీవితంలోని ముఖ్య సంవత్సరాలను తీసికొని, ఆ సంవత్సరాలలో ప్రపంచంలో జరిగిన ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సుబోధకంగా ప్రచురించారు. ఉదా:- 1869లో గాంధీ జన్మించాడు. అదే సంవత్సరంలో సూయజ్ కాలువ తెరవబడింది. ఒక భారతీయుడు ఐ.సి.యస్. పరీక్షలో అందరికంటే అధికంగా మార్కులు సంపాదించాడు. కాని ఆంగ్లేయులు

అది సరికాదన్నారు. అమెరికాలో నాల్గు సంవత్సరాలు జరిగిన అంతర్యుద్ధం సమాప్తమయింది.

అట్లాగే 1917లో చంపారన్‌లో నిరుపేదరైతుల మధ్యకు వెళ్ళి గాంధీ వారి ఉద్ధరణకై కృషి సాగించాడు. ప్రథమ ప్రపంచ యుద్ధంలో అమెరికా తలదూర్చింది. రష్యాలో విప్లవం మొదలయింది. ఈ విధంగా ఎన్నో చెప్పవచ్చు.

గాంధీ చిత్రాన్ని ఒక శాంతియుత ఉద్యమానికి మార్గంగా అమెరికాగాని ఇతరదేశాలుగాని భావించడం ప్రపంచశాంతికే పెట్టనికోటగా భావించవచ్చు.

ఈ విధంగా గాంధీ జీవితమూ, సిద్ధాంతాలు చాలమందిని చాలా విధాల ప్రభావితుల్ని చేసి వివిధ రంగాల్లో కృషిచేయటానికి, పరిశోధనలకీ, అవగాహనకీ ఉపయోగపడ్డాయసటానికి ఈ సంఘటనలు నిదర్శనం.

''ఈ ఆటంబాంబులను నిలిపివేయవలె
లేనిచో మానవునికి సర్వనాశనము నిశ్చయము.
కనుక యీ యుగములో
''జయజగత్'' అను నినాదమే చేయవలెను.
ప్రపంచమంతటికి జయము కలిగి
ఎల్లరూ క్షేమముగా నుండవలె నను
లక్ష్యము కలిగి యుండవలెను.'' - వినోబా

9. గాంధేయ మార్గంలో రాజకీయ వ్యవస్థ సాధ్యమా ?

నీతి, నియమాలులేని రాజకీయాలు మహాపాపం అని, సప్తమహా పాపాలలో ఇదొకటిగా గాంధీజీ పేర్కొన్నారు. నీతి, నియమాలు లేనివే రాజకీయాలుగా వున్న, అంతా మహాపాపపంకిలమైన ఈ రోజులలో గాంధీజీ ఆశించిన రాజకీయ వ్యవస్థ సాధ్యమా?

గాంధీజీ రాజకీయ పోరాటాలను నీతి, నియమాలతో నిర్వహించారు. సత్యము, అహింస సూత్రాల ఆధారంగా, త్యాగము, సేవాభావములతో, ఆత్మవిశ్వాసముతో, ధైర్యసాహసములను కలిగించి నైతిక శక్తిని పెంపొందించి సత్యాగ్రహ పోరాటాలతో స్వాతంత్ర్యాన్ని సాధించారు. ఆనాటి నైతిక విలువలు ఈనాడున్నాయా?

భారతదేశ సమైక్యతకు దోహదము చేయడానికి వివిధ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు రెండువందలమంది ప్రముఖ సంఘసేవకులు పద్మవిభూషణ శ్రీ బాబా ఆమ్టే నాయకత్వంలో సైకిళ్ళయాత్ర చేస్తూ జనవరి 23వ తేదీన రాజ్‌భవన్‌లో గవర్నరు కుమారి కుముద్ బెన్ జోషితో మాట్లాడుతూ గాంధేయ మార్గములో రాజకీయాలను నడిపించగల్గిన దేశప్రగతి, ప్రజల సంక్షేమము సాధ్యమవుతోందని అన్నారు. శ్రీ సి.వి.చారి నన్నుచూపించి ఆ విధంగా ప్రయత్నించుచున్న వారని చెప్పారు. శ్రీ బాబా చెప్పినట్లుగా గాంధేయమార్గములో రాజకీయాలను నడిపించగలమా? అసలది సాధ్యమా?

రాజకీయ స్వాతంత్ర్య పోరాటాలను గాంధీజీ నడిపించారు. కాని అధికార రాజకీయాలను గాంధీజీ అప్పుడే చూడలేకపోయినారు. కాంగ్రెస్ అధికారములోనికి వచ్చిన తరువాత కాంగ్రెస్‌వాదులలో పెరిగిన స్వార్ధము పెరుగుతున్న అవినీతి, అనుభవిస్తున్న ఆడంబరజీవితాల్ని చూచి గాంధీజీ నివ్వెరపోయి కాంగ్రెస్‌ను రద్దుచేసి లోక్‌సేవాసంస్థగా మార్చాలని సూచించారు. ఆ సూచనను కాంగ్రెస్ పరిశీలించింది.

కాంగ్రెసు రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించింది. ప్రజలకు రాజకీయంగా సమాన అవకాశాలను కలిగించింది. ఆర్థికంగా ప్రజలు బలపడేటట్లు, దేశప్రగతికి,

ప్రజల సంక్షేమానికి కృషిచేయాలిసి వుంది. గాంధీజీ ఆశించినట్లు ప్రతివారికి కనీస అవసరాలు తీర్చేవిధంగా సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించాలి. ఈ పనిని సాధించాలంటే కాంగ్రెస్ తప్ప భారతదేశంలో బలమైన రాజకీయపక్షంలేదు. కాంగ్రెస్ సంస్థను రద్దుచేస్తే దేశాన్ని సమైక్యంగా నడిపించగల శక్తిగల పార్టీలులేవు. చిన్నచిన్న పార్టీలలో ప్రాంతీయతత్వాలు పెరిగి దేశసమైక్యతకు దెబ్బతగులుతోంది. త్యాగముతో పోరాటముచేసి, తెచ్చుకొన్న స్వాతంత్ర్యానికి ముప్పు కలుగుతుందని ఆలోచనచేసి కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్‌ను రద్దుచేయాలనే గాంధీజీ సూచనను అంగీకరించలేక పోయినారు. రద్దుచేస్తే దేశప్రగతికి, దేశసమైక్యతకు విఘాతం కలుగుతుందనే విషయము తరువాత దేశ ప్రజలకు అర్ధం అయింది. 1948 జనవరి 30వ తేదీన గాంధీజీని ఒక హిందూ మతోన్మాది తుపాకితో కాల్చివేశాడు. గాంధీజీ బ్రతికివుండి మత సామరస్యానికి, జాతిసమైక్యతకు పనిచేశారు. నవఖాళీలో పాదయాత్ర జరిపారు. కలకత్తాలో ఆమరణ నిరాహారదీక్ష వహించి దేశంలో వచ్చిన మత కలహాలను సమసింపచేయడానికి కృషి జరిపారు. గాంధీజీ తనప్రాణాలను మతసామరస్యం కొరకు ఆర్పించారు. ప్రాణత్యాగంతో దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారు.

కాని గాంధీజీ ఆత్మార్పణ తరువాత దేశంలో నైతికవిలువలు పతనము అవుతూ వచ్చాయి. నైతిక ప్రమాణాలకు విలువనిచ్చి, త్యాగమయ స్వాతంత్ర్య పోరాటాలను నడిపిన కాంగ్రెస్ సంస్థ కాలక్రమేణా నైతిక శక్తి కోల్పోతూ వస్తూంది. బాధ్యతారహిత ప్రవర్తన, ఆడంబరమైన జీవితవిధానము, పరస్పర ఆరోపణలు ఆశ్రిత పక్షపాతము, తప్పులను ఖండించేవారు, సరిదిద్దే పద్ధతులు తరిగి, ఉదాసీన వైఖరి పెరగడం, స్వార్ధము పెరిగి అవినీతికి పాల్పడటం కాంగ్రెస్ వాదులలోనే కాకుండా సామాజికంగానే నైతికవిలువలు క్షీణించాయి. గాంధీజీ సత్యాహింసలతో పెంచి పోషించిన నైతిక శక్తి తరిగిపోతోంది. హింసాయుత తీవ్రవాద రాజకీయాలతో నైతిక విలువలకు మంగళం పాడే సమయం ఆసన్నమైంది. అణుఆయుధాల తయారీతో ప్రపంచశాంతికి ముప్పు ఏర్పడుతుంది. ప్రజాస్వామ్యమా? తీవ్రవాదమా? ఏది దారి? అనే పరిస్థితులకు దిగజారుతున్నాము.

గాంధీజీ కాంగ్రెస్‌లో ప్రవేశించి సత్యాగ్రహ పోరాటాలను నడిపి విప్లవవాదుల విధ్వంసక చర్యలను అదుపుచేశారు. ఆనాటి నుండి నైతిక విలువలకు స్థాయి వచ్చింది. బుద్ధుడు, గాంధీ, వినోబా వంటి పెద్దలు పెంచి పోషించిన నైతికశక్తి రోజురోజుకు జారవిడుచుకొంటున్నాము. వ్యక్తిగతంగా, సామాజికంగా, రాజకీయ, ఆర్థిక రంగాలలో దిగజారిపోతున్నాము. ఏ నైతికశక్తితో ప్రపంచ గౌరవాన్ని పొందామో, ఆశక్తి ఏమయిపోతోంది? ఇది ప్రతి భారతీయుడు ఆలోచించుకోవాలి. అన్ని రాజకీయ పార్టీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ముఖ్యంగా నైతికవిలువలకు ప్రాధాన్యం ఇచ్చిన గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటాలను నడిపించిన భారత జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలు ఆలోచించాలి. గాంధేయ మార్గమును రాజకీయాలలోనికి ప్రవేశపెట్టాలి. ఏ గాంధేయ మార్గంతో స్వాతంత్ర్యాన్ని సాధించామో ఆమార్గంతోనే దేశదారిద్ర్యాన్ని, నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రజలకు కావలసిన కనీస అవసరాలను చేకూర్చి, ప్రజలంతా సుఖశాంతులతో తులతూగుతూ ఉండే గాంధీ ఆశించిన రామరాజ్యాన్ని స్థాపించాలి. దేశంలో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలంటే రాజకీయ స్వాతంత్ర్యము కొరకు చేసిన త్యాగాల కంటే వేయిరెట్లు త్యాగాలు చేయవలసి వుంటుందని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. దేశప్రగతికి దేశసమైక్యత అవసరం. ప్రాణాలు అర్పించి దేశసమైక్యతను నిలబెట్టిన ఇందిరాగాంధీ త్యాగమయ జీవితాన్ని గుర్తించుకోవాలి.

నేడు దేశాన్ని నడిపించుటకు బాధ్యత వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయాలలో నైతికస్థాయిని పెంచడానికి చర్యలు తీసుకోవాలి. శ్రీ రాజీవ్‌గాంధీ ప్రధాని అయిన తరువాత సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవడం, అవినీతిని తొలగించడానికి చర్యలు తీసుకొనడం చాలా ముదావహం. కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రవర్తనా నియమావళిని రూపొందించడానికి ప్రయత్నించడం శుభసూచకం.

అలాగే అన్ని రాజకీయపార్టీలు ఆలోచించుకోవాలి. తీవ్రవాదం తరగాలంటే గాంధేయవాదం పెరిగాలి. గాంధీయమార్గములోనే రాజకీయాలను నడిపించాలి. నైతికశక్తిని పెంచే నాయకత్వం కావాలి. శ్రీ రాజీవ్ ఆలోచనలు సఫలీకృతం

కావాలంటే కాంగ్రెస్‌లో నీతినిజాయితీలను పెంచే నియమాలను పెట్టాలి. ఆచరించాలి.

అందుకు కొన్ని సూచనలు :

1. భారత జాతీయ కాంగ్రెస్ ఆశయమైన సమసమాజస్థాపనకు దేశంలో సుఖశాంతులు చేకూర్చే నవసమాజ నిర్మాణానికి కాంగ్రెస్‌వాదులు అంకితం కావాలి.

2. జాతీయతను, దేశభక్తిని త్యాగాన్ని పెంపొందించుకొని క్రమశిక్షణతో సేవాకార్యక్రమాలలో పాల్గొనాలి.

3. నీతి, నిజాయితీలను పెంపొందించుకొనటానికి, గాంధీయ మార్గాన్ని అర్థం చేసుకోవడానికి, స్వాతంత్ర్య సమర చరిత్రను తెలుసుకొని, ఆకళింపు చేసుకొనాలి, హింసాయుత మార్గాలను విసర్జించాలి. ప్రతి విషయమును మానవతా దృష్టితో పరిశీలించాలి.

4. ప్రజల సంక్షేమానికి, దేశప్రగతికి తోడ్పడే విధంగా, ఏ పదవినైనా బాధ్యతగా స్వీకరించి కృషి చేయాలి.

5. సమాజంలో గౌరవాన్ని పొందే విధంగా ప్రవర్తన వుండాలి. ఆడంబరాలను అదుపులో పెట్టుకొనాలి. చెడు అలవాట్లకు దూరంగా వుండాలి. ఉదాసీనత, అలక్ష్యం, సోమరితనం దరిచేరనీయరాదు.

6. ప్రజలతో సన్నిహిత సంబంధాల్ని పెట్టుకోవాలి. సహనంతో ప్రజల సమస్యల పరిష్కారానికి దోహదం చేయాలి.

ఈ సూత్రాలను కాంగ్రెస్‌వారు ఆచరించితే సమాజంలో గొప్ప మార్పుతోపాటు నైతిక విలువలు పెరుగగలవు. గాంధేయమార్గంలో రాజకీయాలను నడిపించి, దేశ గౌరవాన్ని తారాస్థాయికి తీసుకొని వెళ్ళవచ్చును.

10. ప్రపంచానికి గాంధేయ మార్గమే శరణ్యం

‘‘హింసాయుత మార్గం శక్తిని, సంపదను వృధా చేస్తుంది. ఈ విధంగా వృధా చేసుకోవడం కంటే ఆ శక్తిని, సంపదను ప్రగతి కొరకు ఉపయోగించవచ్చును. వివిధ దేశాలు అణ్వాయుధాలు సమకూర్చుకొనేందుకు పిచ్చిపట్టినట్లు ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో శాంతి, అహింసల అవసరం మరింత పెరిగిం’’దని బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు శతజయంత్యుత్సవ సభలో సరిహద్దు గాంధీ అన్నారు.

సోదర భావాన్ని పెంపొందించుటకు దృఢ సంకల్పం, ధైర్య సాహసాలు అవసరమని. ఈ విలువను సాధించుటలో మహాత్మాగాంధీ విజయం సాధించారని సరిహద్దుగాంధీ అన్నారు.

భారతదేశం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాలలో ప్రముఖపాత్ర వహించిన మహత్తర స్వాతంత్ర్యయోధులు 96 సంవత్సరాల వయోవృద్ధులు, 1969 తర్వాత మళ్లీ భారతదేశానికి వచ్చి గాంధేయమార్గమే ప్రపంచానికి శరణ్యమని ఉద్బోధచేసి వెళ్ళారు. బడుగుదేశాల ప్రజల ఆకలిమంటలు ఒకప్రక్క, సంపన్న దేశాధినేతల అణు ఆయుధ ప్రయోగాలు మరొకప్రక్క, ప్రపంచ భవిష్యత్తు ఏమవుతుందో తెలియని అయోమయస్థితి. పీడిత ప్రజల అభివృద్ధికి తోడ్పడేందుకు కృషిచేసే బదులు, కోట్లాదిడబ్బు అణ్వస్త్రములపై ఖర్చుపెట్టి ప్రపంచ మారణహోమానికి యజ్ఞము చేస్తున్నారు. ఇది ఎంత దారుణమైనదోనని శతవృద్ధుడు సరిహద్దుగాంధీ తన ఆవేదనను, పైమాటలలో వ్యక్తంచేశారు. కోట్లాది డబ్బు ఖర్చుపెట్టి, వేలాదిమంది శ్రమతో తయారయి, లక్షలమంది ప్రజలను హతమార్చేదీ మానవ మారణహోమానికి తోడ్పడేదీ అణ్వస్త్రం, పిరికివాడయిన సంపన్నుని ఆయుధం. వ్యక్తియొక్క త్యాగము, సత్యాహింసలతో కూడిన ధైర్యసాహసాలు గల పేదవాని అస్త్రం సత్యాగ్రహం. మానవత ద్వారా మానవాళి క్షేమానికి, వారి న్యాయమైన కోర్కెల సాధనకు మార్గము సత్యాగ్రహము.

1945 ఆగస్టు 6వ తేదీన హిరోషిమా మీద వేసిన ఆటంబాంబు వలన లక్షమంది చనిపోయారు. వెయ్యికోట్లమంది ప్రజలను హతమార్చ గల అణుబాంబులను ప్రస్తుతం నిలువచేశారని ఒక అంచనా. అణుయుద్ధం వస్తే ప్రపంచమే సర్వనాశనం అవుతుంది. అలీనరాజ్యాలకు నాయకత్వం వహిస్తున్న భారత ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ ప్రమాదాన్ని నివారించి ప్రపంచశాంతికి కృషి చేస్తున్నారు. అణుఆయుధాల నిర్మాణం నిషేధించాలని కోరుతున్నారు. సంపన్న దేశాలు లక్షలాదికోట్లు ఖర్చు పెడుతున్నాయి. ఇది ఎంతఘోరమో ఆలోచించాలి. రిచరు ఎటెన్‌బరో తీసిన గాంధీ ఫిల్ము అనేక దేశాలలో ప్రదర్శించిన తరువాత సత్యము, అహింస, త్యాగములతో వారు చూపిన మార్గము ఉత్తమమైనదని ప్రస్తుతం అతి క్లిష్టపరిస్థితులలో నున్న ప్రపంచానికి వెలుగుబాట అనీ, మానవతకు రక్షణ కలిగించేది, శాంతికి తొడ్పడేది గాంధేయమార్గమని పాశ్చాత్య దేశాలలో కూడ విశ్వాసము కలిగింది. సరిహద్దుగాంధీ శ్రీ బాద్‌షాఖాన్ చెప్పినట్లు గాంధేయమార్గమే ప్రపంచానికి శాంతిసాధన మార్గము. అదే శరణ్యము.

అనుబంధం

శ్రీ మండలితో ఇష్టాగోష్ఠి

[1985 ఆగస్టు-సెప్టెంబరు నెలలలో "గాంధీక్షేత్రం" మాసపత్రికలో శ్రీ జోశ్యుల సూర్యనారాయణమూర్తి, శ్రీ మండలి వారితో జరిపిన ఇష్టాగోష్ఠి]

ప్రశ్న : జాతీయోద్యమ నాయకులతోను, నిర్మాణ కార్య క్రమాలతోను తమ తొలిపరిచయాలు వివరిస్తారా?

జవాబు : మా నాన్న శ్రీ మండలి వెంకట్రామయ్యగారు భావదేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తుండేవారు. వారు గాంధేయవాది. ఖద్దరు కట్టేవారు. గాంధీగారిని గురించి, కాంగ్రెసును గురించి చెప్పుతూ వుండేవారు. వారి మాటలు, బోధలు వింటూ వుండేవాడిని. వారు కాంగ్రెసువాది అని తెలిసి జస్టిస్ పార్టీ జిల్లాబోర్డువారు అనేకచోట్లకు ట్రాన్స్‌ఫర్ చేశారు. మంగళాపురంలో పనిచేస్తున్నప్పుడు శ్రీ చంద్ర రాజేశ్వరరావుగారు వారి భావాలకు ఉత్తేజితులైనారు. వారు ఏ గ్రామములో పనిచేసినా జాతీయోద్యమమునకు తోడ్పడుతూ వుండేవారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఆ ఉద్యమాలను వదిలిపెట్టలేదు. వారి ప్రభావము నా మీద పడింది. 1940లో నన్ను ఆవనిగడ్డ ఉన్నత పాఠశాలలో చేర్చారు. గాంధీజీ వ్యక్తిగత సత్యాగ్రహం ప్రారంభించారు. అవనిగడ్డలో శ్రీ వేమూరి నారాయణమూర్తిగారు, బందలాయిచెరువులో శ్రీ చిరువోలు రాధాకృష్ణమూర్తిగారు, మరల అవనిగడ్డలో శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తి గారు వ్యక్తిగత సత్యాగ్రహాలు మూడు రోజులు చేశారు. ఈ మూడు సత్యాగ్రహాలను చూడాలనే కుతూహలంతో వెళ్ళాను. శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తిగారు అవనిగడ్డ పార్కుదగ్గర సత్యాగ్రహము చేసినపుడు లాఠీచార్జి చేశారు. విద్యార్థులుగ ఉన్న మామీదకూడా చేశారు. అదే ప్రథమముగ స్వాతంత్ర్య ఉద్యమములో పాల్గొనడం. అవనిగడ్డ జాతీయ విద్యార్థి సంఘానికి అధ్యక్షడుగా ఎన్నికయ్యాను. శ్రీయుతులు చిలకపాటి

సుబ్బారావు, కాపూరు వెంకట్రామయ్య చౌదరి యిరువురు తెలుగు పండితులు. జిల్లాపరిషత్తు హైస్కూలులో పనిచేస్తు ఖద్దరుకట్టి, ఈ ఉద్యమాలలో పనిచేస్తున్న మావంటి యువకులను బలపరుస్తూ ఉండేవారు. వారి ప్రోత్సాహముతో మేము అజ్ఞాతంగ అనేక కార్యక్రమాలు చేశాము. ఒక రాత్రి హైస్కూలు చెట్టుమీద కాంగ్రెసు జండాకట్టి, ఆగస్టు విప్లవోద్యమ కాగితాలు అంటించి బయటకు వస్తుండగ పోలీసులు గస్తీ తిరుగుతూ నన్ను పట్టుకున్నారు. లాఠీతో కొట్టారు. అశ్వారావుపాలెం కరణం శ్రీ మండలి సత్యనారాయణగారంటే అప్పుడు అవనిగడ్డలో మంచి పలుకుబడి. వారు మా పినతండ్రిగారని తెలుసుకొని జైలులోనికి తీసుకువెళ్ళిన తరువాత వదలివేశారు. అయినా అద్భుతంగ టెలిగ్రాము తీగలు తెంచి వేయడం, గాలిగోపురముమీద కాంగ్రెసు జండాలు కట్టడం చేశాము. ఈ కార్యక్రమాలలో శ్రీ తూమాటిగాంధీ, శ్రీ బాలకోటేశ్వరరావు మొదలైన మిత్రులుకూడ పనిచేశారు. వారు అరెస్టు అయినారు.

శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు జైలునుండి వచ్చిన తరువాత శ్రీ చిలకపాటి సుబ్బారావుగారింటికి వచ్చారు. శ్రీ సుబ్బారావుగారు నన్ను శ్రీ బ్రహ్మయ్యగారికి పరిచయం చేశారు. అప్పటినుండి శ్రీ బ్రహ్మయ్యగారితో కలసి కాలినడకన దివిసీమలో గ్రామ గ్రామాన తిరిగాము. శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తిగారు ఎంతో ప్రోత్సాహమిచ్చేవారు. 1942 ఆగస్టు ఉద్యమంలో కాంగ్రెసు, విద్యార్థి కాంగ్రెసు నిషేధించబడినాయి. దీవితాలూకా కాంగ్రెసు సమితికి కార్యదర్శిగ నియమించబడినాను. పోలీసులు వెంటాడుతూనే వుండేవారు. మా బాబాయి గారిమీద గౌరవంతో నామీదకు వచ్చేవారుకాదు.

ఆంధ్రవిద్యార్థి పౌరసత్వ కళాశాలను నిర్వహించాను. ఆచార్య రంగాగారు వచ్చారు. అప్పటినుండి రంగాగారికి ఎంతో అభిమానం. జిల్లా యువజన కాంగ్రెసు అర్గనైజరుగా మచిలీపట్టణంలో విద్యార్థి శిక్షణాలయములను పెట్టినాము. శ్రీ సంజీవరెడ్డిగారు వచ్చారు. ఆంధ్ర రైతాంగ విద్యాలయమునకు శ్రీ గోపాలరెడ్డిగారు వచ్చారు. అలా రాష్ట్ర కాంగ్రెసు పెద్దలతో పరిచయాలు కలిగాయి.

భావదేవరపల్లిలో రైతాంగ సమస్యలు మానాన్నగారు చూస్తూ వుండటం వలన, ఆ సమస్యల పరిష్కారంలో వారికి తోడ్పడే అవకాశం కలిగినది. ఇరిగేషన్ సౌకర్యములు, భూములకు పట్టాలు యిప్పించే ఉద్యమాలలో పాల్గొనటంతో గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల అమలుకు అవకాశము కలిగింది.

ప్రశ్న : గాంధీయవాదానికీ రాజకీయానికీ పొంతన కుదురుతుందా? వీటిని తమరెలా సమన్వయ పరుస్తున్నారు.

జవాబు : గాంధీవాదం మా నాన్నగారినుండి వచ్చింది, రాజకీయం శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి నుండి వచ్చింది. మొదటి నుండి గాంధీజీ నిర్మాణ కార్యక్రమములో నాకు ఆసక్తి పెరిగింది. అందుచేత స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడుట ముఖ్యవిధిగా భావించాను. గాంధీజీ ఒకప్రక్క స్వాతంత్రోద్యమాలను నడుపుతూ రెండవప్రక్క 18 అంశాల నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరుపుతూ వుండేవారు. ఆ రెండింటినీ గాంధీజీ సమన్వయం చేసి నడిపేవారు.

ప్రశ్న : గాంధేయవాదం_రాజకీయం, సమన్వయం.

జవాబు : గాంధీజీ అడుగుజాడలలో నిర్మాణ కార్యక్రమాన్ని, రాజకీయమును ఈ రెండు ఎద్దులను సమాజ సేవ అనే బండికికట్టి నడిపించుటవలన దేశసౌభాగ్యానికి ఇతోధికంగా తోడ్పాటుకు కృషిచేసిన వారము అవుతామని నా నమ్మకం.

ఈనాటికీ అ నమ్మకంతోనే రెంటిని సమన్వయపరచుకొంటూ కృషి చేస్తున్నాను. కాని చాలా కష్టమైనపని ఇది. సత్యనిష్టతో సేవాదృష్టితో కూడినది నిర్మాణ కార్యక్రమము. అసత్యం, అవకాశవాదంతో కూడినది రాజకీయం. గాంధీగారు అందుకే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగ వుంటూ నిర్మాణ కార్యక్రమాలకే ప్రాధాన్యత యిచ్చారు.

ఈ రెంటిని సమన్వయపరచాలనే నా ప్రయత్నంలో అనేక ఇబ్బందులు ఎదురౌస్తున్నాయి. అయినా నా ఆశయాన్ని విడకుండా నడుస్తున్నాను. నీతి నియమాలు లేని రాజకీయాలు మహాపాపమని గాంధీగారు చెప్పారు. ఆ రెండూ కరుపు అయినాయి. అందుకే నేడు దేశ రాజకీయాలు కలుషితం అయి రాజకీయ క్లిష్టదశకు చేరుకున్నాయి.

ఇప్పుడైనా గాంధీ ఆశయాల్ని సాధించాలంటే ఈ రెంటినీ సమన్వయపరచినప్పుడే దేశసాభాగ్యానికి అది తోడ్పడుతుంది.

ప్రశ్న : అవనిగడ్డలో గాంధీక్షేత్ర స్థాపన, దాని పూర్వాపరాలు_ఉద్దేశ్యాలు వివరిస్తారా?

జవాబు : 1957లో బందరు పార్లమెంటు సభ్యుడుగా ఎన్నిక అయినాను. మా నివాసస్థలము భావదేవరపల్లి. అందరికీ అందుబాటులో వుండడానికి అవనిగడ్డ చేరాను. సంతబజారులో 8 వేలకు ఒక ఇల్లు కొని వుంటున్నాము. చిన్ననాటి నుండి నిరాడంబరంగ గాంధీజీ విధానంలో నడవాలనే కోరిక ఉండేది. ఉండటానికి ఆశ్రమంలాగ యిల్లు వేసుకోవాలని తలంపు. 40 సెంట్లస్థలము (యిప్పుడున్నది) కొన్నాడు. చాలా లోతట్టుగ ఉండేది. కొత్తపేట, మాచవరం, మోదుమూడి గ్రామాలకు చెందిన మిత్రులు బండ్లతో మట్టితోలి మెరకచేశారు. చుట్టూ గోడకట్టి కొబ్బరిమొక్కలు వేశాను. ఆశ్రమ స్థాయిలో వుండటానికి యిల్లు కట్టాలని ప్లాసువేశాను. అదేసమయంలో రెండుగ్రామాలలో

యిళ్లు తగలబెట్టడం, గడ్డివాములు అగ్నికి ఆహుతికావడం జరిగింది. అందుచే ఆశ్రమంలాగ పూరిఇండ్లతో లాభంలేదని, పక్కాయిల్లు బంగళా పెంకుతో వేద్దామని పునాదులు త్రవ్వించాము. అచటనుండి డాబాగా మార్చబడింది. సంతబజారులో యిల్లు అమ్మివేశాం. మా నాన్నగారు లోను తీసుకున్న డబ్బుతోను గృహప్రవేశానికి మిత్రులు యిచ్చిన సహాయంతోను ఈ డాబా పూర్తిచేశాం.

1967లో దివిసీమ సమష్టి సహకార వ్యవసాయ బృహత్తర ప్రణాళిక ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి వచ్చారు. జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల ప్రక్కన 80 సెంట్లు ఖాళీగా, పొదలతో మెరక పల్లాలతో వుండేది. మీటింగు ఏర్పాటుకు దానిని బాగుచేయించినాము. ఆచట వేదికను కట్టించినాము. తరువాత ఒక చావడివేసి దివిసీమ వైజ్ఞానిక సాంఘిక 'సేవాసమితిని స్థాపించి పదిమంది కూర్చోవడం, మాట్లాడుకోవడం జరుగుతూండేది. 1969లో గాంధీ శత జయంతి దేశమంతా పెద్దఎత్తున జరుగుతుంది. మనము ఏమిచేయాలనే ఆలోచన వచ్చింది. దివిసీమ వైజ్ఞానిక సాంఘిక సేవాసమితి ఆధ్వర్యములో గాంధీవిజ్ఞాన కేంద్రాన్ని స్థాపించాలని అనుకొన్నాము. స్థలము లీజుకొరకు కృష్ణాజిల్లా పరిషత్తును కోరాము. గాంధీక్షేత్ర నిర్మాణానికి 99 సంవత్సరాల లీజుపై దీవిసీమ వైజ్ఞానిక సమితికి జిల్లాపరిషత్తుతో రిజిష్టరు అగ్రిమెంటు జరిగింది. శ్రీ కోసూరు రత్తయ్యగారు వారి పేర యిచ్చిన 8 వేల విరాళముతో గ్రంథాలయ భవనము నిర్మాణముతో ప్రారంభించబడి ఈనాడు ఎంతో అభివృద్ధి సాధించింది. గాంధీజీ నిర్మాణ కార్యక్రమము అమలు జరుపుట, అమలు జరిపే సంస్థలను ప్రోత్సహించుట వాటిని సమన్వయపరచుట గాంధీక్షేత్ర ముఖ్యోద్దేశ్యము. గాంధీగారితో అత్యంత సన్నిహితంగ పనిచేసిన ప్రభాకర్‌జీ మాకు మార్గదర్శకులుగ వుండుట, గాంధీగారి

కోడలు శ్రీమతి నిర్మలా రామదాసుగాంధీ, మనుమడు శ్రీ కనూగాంధీ, మనుమరాలు శ్రీమతి అభాగాంధీ 1977లో రెండు పర్యాయములు గాంధీక్షేత్రములో ఉండుట, కార్యక్రమములలో పాల్గొనుట ఎంతో ఉత్సాహాన్ని, ప్రాధాన్యతను కలుగజేశాయి. దక్షిణ భారత నిర్మాణ కార్యకర్తల మహాసభలు, ఆంధ్రప్రదేశ్ నిర్మాణ కార్యకర్తల సభలు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవాసంస్థల మహాసభలు జరిగాయి.

1977 ఉప్పెన తరువాత సేవాసంస్థల సమన్వయ కేంద్రంగ గాంధీక్షేత్రం మానవ సేవకు అంకితమైంది. 1977 అక్టోబరులో గాంధీ క్షేత్రానికి అనుబంధంగ సేవాశ్రమాన్ని నెలకొల్పి శ్రీమతి నిర్మలా గాంధీగారితో ప్రారంభోత్సవం జరిపించాము. ఉప్పెనవలన అనాధులైన బాలబాలికలకు సేవాశ్రమము కేంద్రమైంది. వారి విద్యాభ్యాసానికి గాంధీజీ బేసిక్ విద్యలో అనుభవజ్ఞులు, చాలాకాలంగా గాంధీజీతో సేవాగ్రాంలో వున్న శ్రీ కె.ఎస్. ఆచార్యులుగారి ఆధ్వర్యములో (పిల్లల విద్యకు) గాంధీ గురుకులం స్థాపించబడింది. వారికి సాంకేతిక విద్య గరిపేందుకు పశ్చిమ జర్మనీకి చెందిన డా॥ హెచ్.హెచ్. డైక్మన్ శ్రీమతి రూత్ డైక్మన్ గార్ల భూరి విరాళంలో ''రూత్ డైక్మన్ టెక్నికల్ ఇనిస్టిట్యూట్'' స్థాపించబడింది. దీనిలో ప్రింటింగ్, బైండింగ్ కంపోజింగ్, కారెంటరీ, షూమేకింగ్, టైలరింగ్, పెయింటింగు, టైపు శిక్షణా తరగతులు నిర్వహింపబడుతున్నవి. వీటి నిర్వహణకు ఏ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనర్ (చిలకలూరిపేట) డైరెక్టర్ డా॥ ఎస్. జాన్ డేవిడ్ ఎంతో తోడ్పడుతున్నారు.

గాంధీక్షేత్రాన్ని గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో ఆదర్శశిక్షణ కేంద్రంగా రూపొందించాలని, నిర్మాణ కార్యక్రమాలకు కార్యక్షేత్రంగ నిలబెట్టాలనే నా ఆశయము. ఆ ఆశయ సాధనకు కృషి చేద్దాం.

ప్రశ్న : తాము నిర్వహించిన సేవా కార్యక్రమాలలో తమకు బాగా తృప్తి కలిగించినదేది?

జవాబు : 1977లో ఉప్పెన...తుఫాను వచ్చినప్పుడు, తరువాత నా ప్రజల మధ్యన ఉండి సహాయ, పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాలలో జాతీయ, అంతర్జాతీయ సేవాసంస్థల సహాయము, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారము సమన్వయపరచి సేవచేయడమే నాకు సంతృప్తి కలిగించిన సేవాఘట్టం.

కోస్తా ప్రాంతములో ఉప్పెనతో తుడిచిపెట్టబడిన గ్రామాలలో ఇండ్లు, రోడ్లు, ఎలక్ట్రిసిటీ, టెలిఫోను సౌకర్యాలు, తుఫాను రక్షిత నిలయం నిర్మాణం చేసి మంచినీటి పథకాన్ని ఏర్పాటుచేయడం లక్ష్యంగా పెట్టుకొని గ్రామాల్ని పునర్నిర్మించడం జరిగింది. పునర్నిర్మాణ కృషి ఆదర్శప్రాయంగా జరిగిందని చెప్పాలి.

శ్రీ మండలి వెంకట కృష్ణారావు బహుముఖ ప్రజ్ఞాశాలి. సిసలైన గాంధేయవాది. అకుంఠిత సేవాతత్పరుడు. అన్నింటికి మించి వారు పేద, బడుగువర్గాల అభివృద్ధికి విసుగు విరామమెరుగక నిరంతరం పోరాడేవ్యక్తి. వారి స్వస్థలమైన అవనిగడ్డలో వారు స్థాపించిన గాంధీక్షేత్రం ఈరోజు సమాజంలోని బలహీనవర్గాల ప్రయోజనాలకయి సమగ్ర అభివృద్ది కార్యకలాపాల కేంద్రమయింది. 1977వ సంవత్సరములో ఆంధ్రకోస్తాతీరపు తుఫాను బాధితుల సహాయార్థం వారు మానవతాదృక్పధముతో చేసిన కృషి సర్వవిదితము. ఆపదలో ఉన్నవారిని ఆదుకొనుటలో వారికిగల ఆతురతకు, వారికిగల గొప్ప కార్యనిర్వహణ సామర్థ్యానికి ఇవి ప్రతీకలు. పదవిలో ఉన్నా లేకపోయినా వారు ఎప్పుడు ప్రజల మనిషిగానే ఉన్నారు. సహజ నిరాడంబరత్వము ప్రజాశ్రేయస్సునందు వారికిగల అవ్యాజమయిన తపన వారిని అందరికి సన్నిహితులను చేశాయి. తనను మరచి తన సహచరులకు సేవచేయుటలోనే పరిపూర్ణ జీవితం ఉన్నదనేది జగమెరిగిన సత్యం. శ్రీ కృష్ణారావు జీవితం ఈ లోకోక్తికి ప్రకాశమయిన ఉదాహరణ .

- డా॥ శంకరదయాళ్ శర్మ



శ్రీ మండలి వెంకట కృష్ణారావు బహుముఖ ప్రజ్ఞాశాలి. సిసలైన గాంధేయవాది. అకుంఠిత సేవాతత్పరుడు. అన్నింటికి మించి వారు పేద, బడుగువర్గాల అభివృద్ధికి విసుగు విరామమెరుగక నిరంతరం పోరాడేవ్యక్తి. వారి స్వస్థలమైన అవనిగడ్డలో వారు స్థాపించిన గాంధీ క్షేత్రం ఈరోజు సమాజంలోని బలహీనవర్గాల ప్రయోజనాలకయి సమగ్ర అభివృద్ధికార్యకలాపాల కేంద్రమయింది. 1977 వ సంవత్సరములో ఆంధ్రకోస్తాతీరప్పు తుఫాను బాధితుల సహాయార్థం వారు మానవతాదృక్పథముతో చేసిన కృషి సర్వవిదితము. ఆపదలో ఉన్నవారిని ఆదుకొనుటలో వారికిగల ఆతురతకు, వారికిగల గొప్ప కార్యనిర్వహణ సామర్థ్యానికి ఇవి ప్రతీకలు. పదవిలో ఉన్నా లేకపోయినా వారు ఎప్పుడు ప్రజల మనిషిగానే ఉన్నారు. సహజ నిరాడంబరత్వము ప్రజాశ్రేయస్సునందు వారికిగల అవ్యాజమయినతపన వారిని అందరికి సన్నిహితులను చేశాయి. తనను మరచి తన సహచరులకు సేవచేయుటలోనే 'పరిపూర్ణజీవితం ఉన్నదనేది జగమెరిగిన సత్యం. శ్రీ కృష్ణారావుజీవితం ఈ లోకోక్తికి ప్రకాశమయిన ఉదాహరణ.

— డా॥ శంకరదయాళ్ శర్మ